శ్రీ హరివంశము



- సరిపల్లె వెంకట సుబ్రహ్మణ్య సోమయాజి

శ్రీహరివంశము

(చిత్సుఖానంద వచన సుధ)



రచన :

సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి

గుంటూరు.

ముద్రణ : నందన ఉగాది, 2012

ప్రతులు : 600


ప్రతులకు : **యస్.వి. సుబ్రహ్మణ్య సోమయాజి**
సి-27, సెక్టర్ -4, అలకాపూర్ టౌన్ షిప్
మణికొండ పోస్టు, హైదరాబాద్-500 089.
సెల్ : **9849584555**

వెల : రూ. **250/-**

ముద్రణ : **శ్రీ లక్ష్మీగణపతి ఆర్ట్‌ప్రింటర్స్**
2/4, బ్రాడీపేట,
గుంటూరు - 522 002
ఫోన్ : 2235036

అంకితం

శ్లో॥ శ్రీ వేంకటాచలాధీశం శ్రియా ధ్యాసిత వక్షసమ్ ।
శ్రిత చేతన మందారం శ్రీనివాస మహం భజే ॥



శ్లో॥ శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయే ఽర్థినామ్ ।
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥

శ్లో॥ నమో నమస్తే అఖిలకారణాయ
నమో నమస్తే అఖిల పాలకాయ
నమో నమస్తే సురనాయకాయ
నమో నమో దైత్య విమర్దనాయ ॥

శ్లో॥ నమో నమో భక్త జనప్రియాయ
నమో నమః పాప విదారణాయ
నమో నమో దుర్జన నాశకాయ
నమో ఽస్తు తస్మై జగదీశ్వరాయ ॥

ఈ గ్రంథము ప్రత్యేకత

★ హరివంశము మహాభారతమునకు ఖిలభాగము. దీనిలోనున్న మూడు పర్వములు గలిసినపుడే మహాభారతము వంద పర్వములగును.

★ ఇందులో సృష్టిమొదలు నేటివరకు ఉద్భవించిన అనేక ప్రసిద్ధ రాజవంశముల చరిత్రయున్నది.

★ భారత భాగవతములలో శ్రీకృష్ణుడొక అద్భుత శక్తులుగల భగవంతుడు మాత్రమే. హరివంశములో ఆయన బాల్యలీలలు, యౌవన ప్రతాపములు, శౌర్యవీర యుద్ధములు, ఆదర్శ గృహస్థాశ్రమ జీవనము, కులదీపకునిగ వ్యవహరించిన తీరు కూడ వర్ణించబడినవి. ఈ గ్రంథము శ్రీకృష్ణుని పరిపూర్ణ జీవనమునకు దర్పణమువంటిది.

★ శ్రీకృష్ణుడు అనేకమంది దుష్టరాజులను స్వయముగా సంహరించి కురుక్షేత్ర సంగ్రామము నొక చిన్న ఘట్టముగ జేసెను.

★ ఉత్తరదేశములో హరివంశమునొక ఉత్తమ పారాయణ గ్రంథముగ స్వీకరించి ఇంటింటా నిత్యము పఠించుదురు.


★ ఇది భుక్తి ముక్తులకు, అభీష్ట సిద్ధికి కల్పతరువువంటిది.

★ సంతానము గోరువారు, పుత్ర సంతతి నభిలషించువారు ఈ గ్రంథ పారాయణము ద్వారా నిశ్చిత ఫలమును తప్పక పొందగలరు.

★ ఎఱ్ఱనగారు రచించిన హరివంశమునందలి కొన్ని మధురాతిమధుర పద్యములను చేర్చి ఈ గ్రంథమును రసరమ్య మొనర్చితిమి.

2)

అక్షర సుమాంజలి



మా నాన్నగారు వ్రాసిన శ్రీమద్దేవీభాగవతము నాకు నిత్య పారాయణ గ్రంథము. నేను మా శ్రీవారు దేవీ భక్తులమే. భగవతి అనేక రూపాలను, అవతారాలను, వారివారి మహిమలను, అనేకానేక దేవీ స్తోత్రములను, శ్రీదేవీ గీతలను మా నాన్నగారు వ్రాసిన తీరు మధురాతిమధురము. ఒకసారి ఒక శీర్షిక చదివితే రెండవ శీర్షిక చదవకుండా ఉండలేము. ప్రతి శీర్షికలో చివరన "ఇందలి ధర్మవిషయములు" అను సమీక్ష హృదయములో చెక్కుచెదరక నిలిచిపోయింది.

మా నాన్నగారికి దేవీ భక్తి మెండు. నా చిన్నతనంలోనే వారు శ్రీవిద్యాదీక్ష గ్రహించినట్లు గుర్తు. వారి గురువుగారు జగద్గురు శ్రీశ్రీ నృసింహానంద భారతీస్వామివారు నాలుగైదు సార్లు మా ఇంటికి భిక్షకు వచ్చారు. మా నాన్నగారు శ్రీ శృంగేరీ శ్రీవిరూపాక్షి శ్రీపీఠానికి కోశాధికారిగా ఉండేవారు. అచట నెలకు రెండు మూడు సార్లు శ్రీచక్రార్చనలు జరిగేవి. శరన్నవరాత్రులు, వసంత నవరాత్రులు, కోటి కుంకుమార్చనలు జరిగేవి. మా అక్కచెల్లెళ్ళు అందరము నాన్న, అమ్మలతో గలసి గుంటూరులో ఆ పీఠానికి వెళ్ళేవారము. స్వామి వారికి పాద సేవ చేసేవారము. సువాసినీ పూజ సమయములో రెండు మూడు శ్యామశాస్త్రిగారి దేవీ కీర్తనలు పాడేవారము.

మా నాన్నగారు శ్రీహరివంశము వ్రాసేటప్పటికి నేను మా శ్రీవారితో అమెరికా వెళ్ళిపోయాను. "నేను హరివంశము వ్రాస్తున్నాను. నీకు కొడుకు పుడతాడులే" అని నన్ను ఆశీర్వదించి అమెరికా పంపారు. వారు హరివంశము పూర్తి చేసేటప్పటికి నాకు కొడుకు పుట్టాడు. నాకు ఆశ్చర్యము కలిగింది. వారు వ్రాసిన డి.టి.పి ప్రతిని చదవాలని ఉత్సాహం కలిగింది. "హరివంశము పురాణమా లేక ఇతిహాసమా" అని అడిగాను. "రెండూనూ" అన్నారు నాన్నగారు. మహాభారతమునకు ఖిలభాగము కావున ఇతిహాసము. పురాణ పురుషుని దివ్యచరిత్రగావున పురాణము. హరివంశములో ఆదిపురుషుడు శ్రీహరి. ఆయన వీర్యమునుండి బ్రహ్మదేవుడు, బ్రహ్మదేవుని నుండి ఈ చరాచర సృష్టి ఉద్భవించినది. కావున ఈ జగత్తులో భూత భవిష్యద్వర్తమాన భూతజాలమంతయూ శ్రీహరియే అని చెప్పారు.

హరివంశంలో అనేకమంది రాజవంశముల దివ్యచరిత్రలు ఒక పర్వమునందున్నవి. విష్ణు పర్వములో అంతా శ్రీకృష్ణుని చరిత్రయేయున్నది. శ్రీకృష్ణుని బాల్యలీలలన్నియు మన కనులముందు దృశ్యరూపముగ కదులాడునట్లు మా న్నాగారి రచన పరుగులెత్తింది. గోపబాలురలో ఒకరిమై, గోపికలలో ఒకరిమై, నందగోకులములో ఒకరిమై మనము కూడ శ్రీకృష్ణుని వెన్నంటి బాల్యలీలలు దర్శించినటులనిపించినది. శ్రీకృష్ణుడొక వీరునిగా, శూరునిగా, ధీరునిగా చేసిన

ఘనకార్యములెన్నియో రంగుల రీళ్ళలో చూచినట్లున్నది. ఆ గోమంతక గిరియుద్ధము, నరకాసురవధ, హంసడింభకుల వధ మున్నగు ఘట్టములు చదువుతుంటే ఒక కదనరంగము కళ్ళకు కనబడుతుంది.

భవిష్యపర్వము కొంచెము భక్తితోగూడిన ఆధ్యాత్మిక తత్త్వానికి రంగ ప్రవేశమువంటిది. అందులో ఘంటాకర్ణుని భక్తి పారవశ్యము చూస్తే పిశాచములకే ఇంతటి భక్తి గలిగినపుడు మానవులకు కృష్ణభక్తి అలవడుకుండునా అనిపించినది. ఏది ఏమైననూ హరివంశము ఒక మకరంద స్రవంతి. దానిని రుచిచూచిన తరువాత పదేపదే కన్నులతో గ్రహించి, మనసులో స్మరించి, తనివి తీర గ్రోలి మళ్ళీమళ్ళీ చదవాలనే ఆకాంక్ష పెరుగుతుందే తప్ప ఎన్నటికీ తృప్తితీరదు. నాన్నగారు దేవీ భక్తి నుండి శ్రీకృష్ణ భక్తి పారవశ్యములోనికి జారిపోయారనిపించింది. ఇదే మాట ఆయనను అడిగితే ఏమన్నారో తెలుసునా. "ఆ శ్రీదేవి పద్మనాభ సహోదరి గదా! ముఖములు రెండైననూ వారి ఉదరము ఒకటే. ఆ ఉదరములో సమస్త బ్రహ్మాండములు ఉన్నవి. బ్రహ్మాండములలో ఒక బ్రహ్మాండమునందు మనమొక పిండాండము కదా. అందుకని ఒకరియందు భక్తి కలిగితే రెండవ వారియందు భక్తి కూడ సమానముగ పెంపొందును" అని సమాధానపరచిరి. ఈ హరివంశములో సందర్భానుసారము కవిత్రయములో ఒకరైన ఎఱ్ఱనగారి పద్యములు నేతిలో వేయించిన జీడిపలుకువలె కమ్మనిరుచితో పసందుగానున్నవి. ఏది ఏమైననూ మా నాన్నగారి పెంపకములో మేము కూడ దేవీ భక్తులము, కృష్ణభక్తులము అగుట మా పూర్వజన్మ సుకృతమనుకొందుము. వారి దీవెనలు మా దంపతులకు, మా చిరంజీవులు నృసింహకార్తికేయ, సంయమ కౌశికులకు ఎల్లపుడూ రక్షణగా నుండవలెనని కోరుకుంటూ ఈ అక్షర సుమాంజలి సమర్పించుకొనుచున్నాము.

అయల సోమయాజుల నాగప్రతిభా దుర్గాప్రసాద్

తొలిపలుకు

భక్తచిత్తానురోధేన ధత్తే నానుకృతీఃస్వయమ్ ।
అద్వైతానందరూపోయస్తస్మై భగవతే నమః ॥

ఎవ్వనియందు ఐశ్వర్యము - మాధుర్యము - సౌందర్యము - సౌశీల్యము - ప్రాగల్భ్యము - సర్వజ్ఞత్వము - భక్తవాత్సల్యము - భృత్యువశత్వము మున్నగు గుణవిశేషములుండునో వానిని భగవంతుడని శాస్త్రార్థములు తెలిపినవి. అవాఙ్మానస గోచరుడగు భగవంతుడు కనులకు అగుపడునా! భగవత్తత్త్వము అవతార విశేషముగా చూడవచ్చునని మహాత్ములనిరి. అవతారమనగా పరబ్రహ్మము దిగివచ్చుట. భగవదవతారములు కొన్ని లీలావతారములు - కొన్ని గుణావతారములు - కొన్ని ఆవేశావతారములు - కొన్ని విభావావతారములు - కొన్ని అర్చావతారములు - కొన్ని యుగావతారములు. అవతారములన్నియూ నిత్యము - శాశ్వతము - సర్వగుణసంపన్నము - పూర్ణజ్ఞాన స్వరూపము - పరమానంద సందోహమునైనవే.

అంశత్వం నామ శక్తీనాం సదాల్పాంశ ప్రకాశితా
పూర్ణత్వం చ స్వేచ్ఛయైవ నానాశక్తి ప్రకాశితా ॥

అనంతశక్తిగల భగవంతుడు కొద్దిపాటి శక్తి ప్రకటించినచో "అంశ" యనబడును. అట్లుగాక యిచ్ఛానుసారము స్వేచ్ఛగా శక్తులు ప్రకటించినచో అది పూర్ణావతారమగును. ప్రతి అవతారము ధర్మసంస్థాపనకు ఉద్దేశించినదియే. జగత్సృష్టికి ముందర భగవంతుడు నారములను (జలములను) సృజించెననియు, ఆ నారములలో తన శక్తి (వీర్యము) నాధానము చేసెననియూ, అందుచే నారాయణుడు అనబడెననియూ పురాణములు వర్ణించినవి. శ్రీమన్నారాయణుని "వీర్య సంజాతమైన సృష్టియావత్తూ హరివంశమునందలి కథావస్తువు". శ్రీమన్నారాయణుడే సర్వవ్యాపకత్వముచే శ్రీమహావిష్ణువనబడెను.

శ్రీమహావిష్ణువు తన లీలావతారములలో విశ్వత్వ - హరిత్వ - వైకుంఠత్వ - శ్రీకృష్ణత్వ - ఈశ్వరత్వములను ప్రదర్శించెను. జగద్రక్షణార్థమై అవతరించి అభయమిచ్చుట విశ్వత్వము. దురితములను - దుఃఖములను పోగొట్టునది హరిత్వము. సర్వసమర్థత గలిగియుండునది వైకుంఠత్వము. సత్తారూపుడైననూ సంసారానందరూపునిగా అస్తిత్వము ప్రదర్శించునది శ్రీకృష్ణత్వము. నిగ్రహానుగ్రహ శక్తి సంపన్నమైనది ఈశ్వరత్వము. శ్రీవేదవ్యాసమహర్షి హరివంశమును మహాభారత

గ్రంథమునకు ఖిలభాగముగా రచించెను. శ్రీమద్భాగవతమును కూడ భక్తిరసాయన శుద్ధతాత్త్విక గ్రంథముగా రచించెను. ఈ గ్రంథములు రెండింటిలో శ్రీకృష్ణలీలలు మిక్కుటముగా నున్నవి. కథాభాగములు కూడా అధికములొక్కటిగనే యున్నవి. వేదవ్యాసమహర్షి ఇవ్విధముగా రెండు గ్రంథములు వ్రాయుటలో ప్రయోజనమేమి? శ్రీమద్భాగవతమునందు శ్రీమహావిష్ణువు యొక్క శ్రీకృష్ణత్వ - ఈశ్వరత్వములే ప్రతిపాదించబడినవి. "కృష్ణస్తు భగవాన్ స్వయమ్" అని నిరూపించబడెను. కాని హరివంశములో విశ్వత్వ – హరిత్వ – వైకుంఠత్వములు కూడా ప్రతిపాదింప బడినవి.

వృష్ణి - అంధక వంశముల చరిత్ర ప్రస్తావనతో ప్రారంభమైన హరివంశము మూడు పర్వములుగా విభజించబడినది. హరివంశపర్వములో జగత్సృష్టి - దక్షసృష్టి - పృథోపాఖ్యానము - మన్వంతర వర్ణనము - కాలవ్యవస్థ - సూర్యసంతతి - పితృకల్పము – వైవస్వత, చంద్ర, అమావసు, ఆయువు, కాశీరాజ, యయాతి, పూరు, యదు, వృష్ణి అంధక వంశముల చరిత్రలు వర్ణించబడినవి. శ్రీభగవానుని విశ్వవ్యాపకత్వమును "సర్వము నారాయణుడే" అని ప్రతిపాదించబడినది. హరివంశపర్వములోనే సంగ్రహముగా భగవదవతారములు వర్ణించబడినవి. శ్రీకృష్ణావతార సందర్భము విస్తారముగా ప్రస్తావించబడినది. వీనిని స్మరించు మానవుడు సర్వపాపవిముక్తుడగును గావున హరిత్వము యివ్విధముగా నిరూపించబడినది. హరివంశ పర్వము చదువు వానికి బుద్ధి - సమృద్ధి - అనంత భోగములు సంప్రాప్తించును.

సంసారసింధు మతి దుస్తర ముత్తి తీర్షోర్యాన్యః ప్లవో భగవతః పురుషోత్తమస్య
లీలాకథారస నిషేవణమంతరేణ పుంసో భవే ద్వివిధ దుఃఖ దవార్థితస్య

(భా 12.4.40)

దుస్తరమైన సంసారసాగరములో పడి దుఃఖములనే భయానక అగ్నితో దహించుకుపోవుచున్న జీవులకు భగవల్లీలాస్మరణము అమృతరసాత్మక ఔషధమే. భగవల్లీలా స్మరణమనే నావతో సంసారమును దాటి శాంతిని పొందవచ్చును. హరివంశములో విష్ణుపర్వమునందు భగవానుని వైకుంఠత్వము - శ్రీకృష్ణత్వము పుష్కలముగా వివరించబడినది. "సవై బలం బలినాం చాపరేషు" అనినట్లు శ్రీకృష్ణునొక లోకోత్తర పురుషునిగా వర్ణించినది. శ్రీకృష్ణుడు జ్ఞాన విజ్ఞానములకు - నీతి నియమములకు నెలవు. తాను ధర్మము నాచరించి ఇతరులకు ఉపదేశించెను. దుష్టశిక్షణ శిష్టరక్షణ గావించి ఆదర్శపురుషుడయ్యెను. ప్రజల శాంతిమయ జీవనమునకు విఘాతమొనర్చు ముష్కరులను మట్టుబెట్టెను. దురాచారుల గుండెలలో గుబులు

పుట్టించెను. రాజనీతితో క్షత్రియలోకమును సంస్కరించెను. జాతి ధర్మములు పునరుద్ధరించెను. అతని జననము - వ్రజవాసము - బృందావన ప్రవేశము - కాళీయమర్దనము - నరకాసురుడు, నికుంభుడు మున్నగు అసురుల సంహారము వీరోచితము. గోవిందపదము - రాజేంద్రపదము అతని ప్రభుతను చాటిచెప్పునవి. గోమంతగిరి యుద్ధము - పారిజాతాపహరణము అతని యుద్ధకుశలతకు గీటురాళ్ళు. అతని "వాసుదేవ - సంకర్షణ - ప్రద్యుమ్న - అనిరుద్ధ"చతుర్వ్యూహాత్మక అవతార విశేషములన్నియు "షట్పుర విజయము - ప్రభావతీ ప్రద్యుమ్నము - శంబరాసురవధ - ఉషాపరిణయము - వరుణ పరాజయము" లందు గానవచ్చును. అతని సాంకేతిక పరిజ్ఞానము ద్వారాకానగర నిర్మాణమునందు తెలియవచ్చును. అతని కళాపిపాసకు పిండారక తీర్థవిహార యాత్ర ఒక నిదర్శనము.

శ్రీకృష్ణుడు ధర్మజ్ఞుడు. సత్కర్మానుష్ఠానమునందు - దేవతారాధనయందు శ్రద్ధాతత్పరుడు. శివధ్యానము - తపస్సు మెండుగా జేసెను. "కృష్ణస్తు భగవాన్ స్వయమ్" అనునది దక్షిణావైశిష్ట్యము అను ఉపాఖ్యానమునందు గనబడును. ఛాందోగ్యోపనిషత్తు ప్రకారము శ్రీకృష్ణుడు ఉపనిషద్బోధను ఘోర అంగిర ఋషి వద్ద పొందెనని యీ క్రింది మంత్రము చెప్పుచున్నది.

"తద్ధైతత్ ఘోర అంగిరః కృష్ణాయ దేవకీపుత్ర యోక్త్వోవాచా౽పిపాస ఏవ స బభూవ, సో౽న్తవేలాయా మే తత్త్రయం ప్రతిపద్యేతాక్షిత మస్యచ్యుతమసి ప్రాణసంశితమసీతి" (3:27)

మానవుడు తన అంత్యకాలములో మూడు వాక్యముల నుచ్చరించవలెనని ఋషి ఆదేశించెను. "త్వం అక్షితమసి - త్వం అచ్యుతమసి - త్వం ప్రాణసంశితమసి" ఈశ్వరా! నీవు అవినాశివి. నీవు ఏకమాత్ర రస స్వరూపుడవు. ప్రాణులకు జీవనప్రదాతవు. శ్రీకృష్ణుడు యీ ఉపదేశవాక్యములను విని తాను నేర్చుకొనవలసినది పూర్తయినదని తలంచెను. ఇందులోని అంతరార్థమేమనగా దేహములందు గమనాగమనములు చేయు జీవుడు ఎల్లప్పుడూ అమరుడే. జీవునకు చావులేదు.

వాయురనిల మమృతమథేదం భస్మాంతం శరీరమ్

ఓం కృతోస్మర కృతం స్మర కృతో స్మర కృతం స్మర (యజు - 40:7)

జీవునకు శరీరముతో వియోగమేర్పడినపుడు బలప్రాప్తికై ఓంకారమును స్మరించవలెను. తాను చేసిన కర్మలను స్మరించవలెను. జన్మాది మరణ పర్యంతము దైవారాధన - సత్కర్మానుష్ఠానము చేయువానికి అవియే స్మరణకు వచ్చును. శ్రీకృష్ణుడు యీ ఉపదేశము నాలకించి అవ్విధముగనే జీవిత పర్యంతము నడుచుకొనెనని అభిప్రాయము.

హరివంశమునందలి భవిష్యపర్వము పరతత్త్వమును ప్రబోధించి శ్రీమహావిష్ణువు యొక్క ఈశ్వరత్వమును నిరూపించెను. భవిష్యపర్వములోని కాలప్రభావము - అనంతశయనుడు - పుష్కరసంభవము - బ్రహ్మయోగము - బ్రహ్మయజ్ఞము - ఆత్మజ్ఞానము - ధర్మవిజయము పరతత్త్వమును ఉపదేశించినవి. అట్లే యజ్ఞవరాహము - నృసింహావతారము - వామనావతారము - దేవాసుర సంగ్రామము - బలి విజయము ధర్మప్రబోధము చేసినవి. ఘంటాకర్ణుని చరిత్ర పరాభక్తికి మచ్చుతునక. "శివకేశవులు" సర్వమతసమానత్వమును చాటి చెప్పినది. పదునెనిమిది పురాణములు వినుటవలన లభించు పుణ్యము కేవలము ఒక్కసారి హరివంశ శ్రవణముచే కలుగును. హరివంశశ్రవణముచే పుత్రార్థులకు పుత్రులు -ధనార్థులకు ధనము లభించును. మహాపాతకోపాతకములు నశించును. హరివంశమును చదువువారు - వినువారు కష్టములనుండి గట్టెక్కుదురు. వారికి సర్వశుభములు గలిగి మనోవాంఛితములన్నియూ దీరును.

హరివంశమును తెనుగువచనము చేయవలెనను సంకల్పము కేవలము భగవత్ప్రేరితము. ఈ గ్రంథములో అచ్చటచ్చట ప్రబంధపరమేశ్వరుడు ఎఱ్ఱనగారి పద్యరత్నములు పొందుపరచి ఆ మహనీయునకు శ్రద్ధాంజలులు సమర్పించితిని. ఈ గ్రంథమునకు మకుటాయమానమైన పీఠిక వ్రాసిన ఎఱ్ఱన పీఠవ్యవస్థాపకులు - దర్శనాచార్యులునైన డా॥ ఆకొండి విశ్వనాథం గారికి, శతావధాని డా॥ వారణాసి శివరామకృష్ణ గారికి నా వినమ్రపూర్వక నమస్సుమాంజలులు. ఆస్తిక మహాశయులెల్లరూ హరివంశ శ్రవణ పఠనాదులచే ఆయురారోగ్యఐశ్వర్యాదులు పొంది పుణ్యశీలు రగుదురని అకాంక్షిస్తూ......

బుధజన విధేయుడు

సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి

శ్రీసుదర్శనము

శతవధాని డా॥ వారణాసి శివరామకృష్ణ

"జయ"మను పేరుగల మహాభారతమును, వ్యాసమునీంద్రుడు రచించెను. ఉత్తర భారతమున తాటియాకులుండవు. భూర్జరీపత్రములు ఉండును. తాటియాకులకంటె వెడల్పుగా విశాలముగా మృదువుగా నుండు పర్ణము లివి. హిమాలయములందు అధికముగా పెరుగును. ఉన్నతవృక్షము లివి. వ్యాసుడు పురాణములను, భారతేతిహాసమును, భాగవతమును, బ్రహ్మసూత్రములను హిమాలయమందలి బదరికాశ్రమమున రచించినట్లు బదరీనాథక్షేత్రవాసుల నమ్మకము. రామాయణము వాల్మీకి ప్రోక్తము. ఈ రామాయణ భారతములు పురాణముల క్రిందకు రావు. వాస్తవగాథలగుటచే, ఇతిహాసములుగా ప్రసిద్ధములు కాబట్టి ఈ రెంటిని కావ్యలక్షణములు బాగుగా పట్టి, విశేషజనాదరణకు పాత్రములైనవి. నిత్యనూతనములుగా, రసవత్కథా సంవిధాన మాధురీభరితములై ప్రపంచ ప్రజలచే కొనియాడబడుచున్నవి.

భారతకథ కంటె రామాయణగాథ పురాతనము. కాని యొక అద్భుతము చమత్కారము నగు విషయము ఉన్నది. రామాయణకథాకాలము నాటి కొందఱుపురుషులు, స్త్రీలు, భారతకథలో సాక్షాత్కరింతురు. కొన్ని పురాణపాత్రలు రెండింటను కన్పింతురు. మొదటిదానికి పరశురాముడు, ఆంజనేయుడు మున్నగు వారును, రెండవదానికి మార్కండేయాదులు ఉదాహృతులు. రామాయణమును ప్రచేతసుని పుత్రుడగు వాల్మీకి చతుర్ముఖ బ్రహ్మ ఆజ్ఞానుసారము, సరస్వతీదేవి తన రసనాంచలముపై నర్తింప, తమసా నదీ ప్రాంతమున కూర్చుండి, రామకథాధ్యానశీలుడై రచించెను. గంగ కిఱుప్రక్కల నున్న నదులు తమస, సరయూనదులు. సరయూనదీ తటమున కోసలరాజధానియే అయోధ్య. రామాయణ రచనాకాలము నాటికి రామాయణ పూర్వగాథ ముగిసియున్నది. పాత్రములును సజీవములే. ఉత్తరగాథ వాల్మీకి స్వయముగాచూచి యున్నదే. ఉత్తర రామాయణకర్తయు నతడే. "ఋతంభరా తత్ర ప్రజ్ఞా" అను పాతంజల యోగశాస్త్ర సూత్రానుసారము, ఒక రచయిత సమాధ్యవస్థలో నున్నప్పుడు ఋతంభరుడైన (అనగా సత్యరూపుడైన) భగవానుడు వానిలో ప్రవేశించి ప్రజ్ఞను అనగా శక్తిని యొసంగును. ఆ శక్తిచే ఆ రచయిత యోగివలె గతమును

రచించును. అద్భుతశిల్ప సౌందర్యముతో ఆ గ్రంథము రాణించును. గ్రంథము కళాఖండమగును. ఆచంద్రతారార్క మనోహరమగును. అది గ్రంథమే కానవసరములేదు. సంగీత, చిత్రలేఖన, శిల్ప, నాట్యాదులు కావచ్చును. చతుష్షష్టికళలు కావచ్చును. వాల్మీకి కవీంద్రునిచే రామాయణము అపూర్వ సౌందర్యమయముగా సృష్టింపబడి, రసజ్ఞలోకముచే, శాశ్వతముగా బహుధా ఆరాధింపబడుచున్నది. బహుభాషలలో రామాయణ రచనలు చేసి, చేసి, సాముగరిడీలు చేసిన మహాకవులు సైతము వాల్మీకి మహాకవి మార్తాండుని కిరణధాటికి వెలవెలబోవుచున్నారు.

ఇక మహాభారత విషయము. 100 పర్వములతో లక్షశ్లోకములతో భారతము లభ్యమగుచున్నది. వ్యాసుడు తొల్త దాదాపు 16000 శ్లోకములతో రచించినట్లు వినికిడి. వ్యాసశిష్యులు, దానిని పెంచి పెంపుచేసిరి. ప్రచారము చేసిరి. కావలసినచోట్ల గ్రంథసన్నివేశములు పెంచబడినవి. ఉత్తరరామాయణమున దప్ప పూర్వరామాయణములో వాల్మీకి కనిపించడు. భారతమందట్లుగాదు.

భారతకథాసన్నివేశములలో తత్కథారచయితయగు వ్యాసమునీంద్రుడు పలుచోట్ల సాక్షాత్కరించును. ధర్మసందేహములు తీర్చును. కొన్ని అద్భుత కృత్యములను చేయును. "వ్యాసో నారాయణోహరిః" వ్యాసుడు సాక్షాత్తు నారాయణుడే అనిపించును. సరే. ఈయన భారతము రచించెను. ఒక్కొక్కపుడు భారతమునకు నాయకుడెవరా యనిపించును. అసలు ఏ కథాసూత్రముండెనా? ఉన్నచో కథానాయకుడెవరు? ధర్మజుడా? అర్జునుడా? భీముడా? వ్యాసుడా? శ్రీకృష్ణుడా? అయోమయము కొంత పాఠకరసజ్ఞులకు కలుగక మానదు. కన్నడమున పంపభారతము కలదు. అందు కథానాయకుడు అర్జునుడే. ధర్మజుడు కురుక్షేత్ర సంగ్రామమున చూపిన శౌర్యపరాక్రమములు అంతగా లేవు. శల్యుని మాత్రమే సంహరించెను. ఆ యవకాశమును బలవంతముగా అర్జునుని నుండి, ఇతడు గైకొనెను. భారతయుద్ధము కాలుని మహాయజ్ఞము. ద్వాపరాంత ప్రళయ సన్నివేశము. రుద్రాంశతో శ్రీకృష్ణుడే స్వయముగా పార్థసారథియై, యుద్ధము నడిపించెను. ఆ లీలామానుషవిగ్రహుడు పాండవపక్షపాతియైనట్లు నటించినను ధర్మపక్షపాతిగ నుండెను. లేకున్నచో అభిమన్యుని మరణము జరుగనేరదు. రాముడు మానవమాత్రుడుగా నుండి అపూర్వములు అద్భుతములునైన కృత్యములు చేయగా శ్రీకృష్ణుడు సాక్షాద్దైవరూపమును కావలసినచోట్ల ప్రదర్శించుచు, యుద్ధము నడిపెను. తాను మాత్రము యుద్ధము చేయలేదు. కారణమేమి? బాల్యమునుండి చంపదగిన రాక్షసవీరులను, ప్రసిద్ధులను,

లోకకంటకులను చంపి చంపి కృష్ణుడు చేతులు దులుపుకొనెను. అన్న బలరామునిచేతను దుష్టశిక్షణము కావించెను. యాదవ వీరప్రముఖులు ఉన్నారు. వారిచేతగూడ ఆయా సందర్భములలో మహాయుద్ధములు చేయించెను. ఈ భారతయుద్ధమున యదువీరులు, సాత్యకి, కృతవర్మలు పాల్గొనకుండ కృష్ణుడు జాగ్రత్తపడెను. వారు పాల్గొనినచో 18 దినములవరకు సంగ్రామము జరుగదు. రెండు మూడు రోజులతో తేలిపోవును. అందరును జగత్ప్రసిద్ధవీరులే. పద్మవ్యూహములు కూడ తెలిసినవారే. మహాశక్తిసంపన్నులే. శ్రీకృష్ణుని దృష్టివేఱు. కౌరవపాండవ సంగ్రామము ఆయనకు ఒక లీల. ఒకరిద్దరు రాక్షసులు ఇరుప్రక్కల పాల్గొన్నను, భారతవీరులు శ్రీకృష్ణునిచేతిలో చచ్చిన ప్రఖ్యాత లోకకంటకులముందు, సాధారణ సైనికులు మాత్రమే. అతిలోకశౌర్యము బహుపర్యాయములు ప్రదర్శించిన యాదవవీరులను యుద్ధమునకు దూరముగా నుంచి, తానుగూడ యుద్ధము చేయకుండ, సారథ్యము చేయు నెపమున యుద్ధతంత్రము నడిపించెను. అట్టి శ్రీకృష్ణునివంటి మహనీయకథానాయకుని వదలి భారతరచనతో చేతులు కడుగుకొనుటకై మనస్సు రాలేదు వ్యాసునకు. భారతమును చరితార్థము, పవిత్రము, పుణ్యకథాశ్రితము చేయుటకు శ్రీకృష్ణునిచరిత్రను గ్రహించుటకు, నాయకునిగా స్వీకరించుటకు భారతము కావ్యధర్మములతో నున్నందున వ్యాసుడు సంకటస్థితిలోపడెను. దీనికి వ్యాసుడొక ఉపాయమాలోచించెను. అసలు ద్రౌపదీస్వయంవర ఘట్టమున మాత్రమే శ్రీకృష్ణుడు భారతకథలో ఆదిపర్వమున దర్శన మిచ్చును. ఎక్కడను ఆయన జననము, బాల్యచేష్టాదులు, ఘనకార్యములు కన్పించవు. విన్పించవు. ఈ యసంతృప్తిని తొలగించు మార్గమును వ్యాసుడాలోచించెను. 100 పర్వములందు లక్షశ్లోకములలో రచింపబడిన భారతకథను ముగించి, ఖిలపర్వములుగా మూడు పర్వములను, హరివంశపర్వము - విష్ణుపర్వము - భవిష్య పర్వములను పెంచి వ్రాసెను. ఈ మూడు పర్వములలో మొదటి హరివంశపర్వమున విష్ణుకథలు ఉండవు. కేవల రాజవంశములు ఉండును. చరిత్ర, సన్నివేశములు చాల తక్కువ. యదువంశమున శ్రీకృష్ణుని వంశీయులు వచ్చుదురు. సృష్టిక్రమములో బ్రహ్మ, ప్రజాపతులు, మనువులు, సూర్యచంద్రాదులు, ఋషులు నానారాజ వంశీకులందరికిని ప్రథమగణ్యులు. అందరు శ్రీహరిస్వరూపమే. హరి సృష్టిలో సనాతనుడు. హరినుండి సంక్రమించిన బ్రహ్మరుద్రులు మొదలుకొని సృష్టిలోని చరాచర ప్రాణికోటియంతయును హరివంశము క్రిందకు వచ్చును. మిగిలిన రెండు పర్వములందును శ్రీహరి మహత్త్వములు అవతార మహిమలు వచ్చును. ఈ మూడు పర్వములకు శ్రీహరియే కథానాయకుడు. ఆయన విభవావతారములు రాముడు, కృష్ణుడు. మిగిలినవి అంశావతారములు. రామకృష్ణులలో కృష్ణావతారము

పూర్ణావతారము. ఆయన పుట్టుకతోనే అద్భుతములు చూపెను. రాముడు రెండు చేతులతో పుట్టగా కృష్ణుడు నాలుగు చేతులతో పుట్టెను. వసుదేవుడు, దేవకీదేవి స్తుతింపగా రెండు చేతులు ఉపసంహరించుకొని వారి భయమును పోగొట్టెను. ఈ విషయము విష్ణుపర్వమున లేదు. భాగవతమున కలదు. త్రిమూర్తుల లోకములు ఊర్ధ్వమున ఉన్నవికదా. బ్రహ్మవైవర్తము, దేవీభాగవతము మొదలైన పురాణములు వైకుంఠముపైని గోలోకము అందు కృష్ణుడు, రాధాదేవి, గోవులు, విరజానది మున్నగు విషయములను ప్రస్తావించినవి. శ్రీకృష్ణునకు శ్రీహరికి సంబంధించిన ఈ మూడు పర్వముల సంపుటిని, ఖిలముగా అనుశీలించి, భారతముతో కలిసిపోవునట్లు వ్యాసమునీంద్రు డొక బ్రహ్మాండ కథాసూత్ర ప్రణాళికను అనుసంధానించెను. ఈ మూడును జేర్చినపుడు మహాభారత నామము ప్రసిద్ధము. ఈ మూడు లేనిదే మహచ్ఛబ్దము వర్తించదు. అది వట్టి భారతము. పుక్కిటి భారతము మాత్రముగాదు. ఇచట ఖిలమనగా అనుబంధము. శేషము. శ్రీకృష్ణచరిత్ర కూడ చేర్పబడి భారతము మహాభారతముగా సుప్రసిద్ధమైనది.

శ్రీహరివంశకథలు వర్ణించు గ్రంథము లింకను గలవు. అవి వ్యాసుని కాలమనందే పుట్టియుండవచ్చును. సంస్కృతవాఙ్మయమున పరాశరమహర్షి (వ్యాసమునీంద్రుని జనకుడు) విష్ణుపురాణము రచించెను. విష్ణుధర్మోత్తర ఖండము అను మఱియొక పురాణము వెలసెను. వ్రేపల్లెలోని నందుని కులగురువు, యాదవపురోహితుడు నైన గర్గమహర్షి గర్గసంహిత వ్రాసెను. దీనికి గర్గభాగవత మనియు పేరు. దీనికి ముందుగాని వెనుకగాని భాగవత గ్రంథము పుట్టెను. ఈ భాగవత రచన వ్యాసుడే చేసినట్లు లోకమున ప్రసిద్ధి కలదు. కొందరు భోపదేవుడను మునిని పేర్కొందురు. పుత్రశోకమున నున్న వ్యాసుని నారదుడు ప్రేరేపించగా, కవితాశక్తితో, భక్తిపారవశ్యముతో శ్రీమన్మహాభాగవతమును ఆయన నిర్మించెను. అట్టి మహారచన సాధారుణులు చేయలేరు. అన్ని పురాణములకంటె భాగవతమున కున్న కీర్తి పవిత్రతలు వేనికీ లేవు. హరివంశము, భాగవతము రెండు విష్ణు కథానిబద్ధములే. రెంటికి నిర్మాణకర్త వ్యాసుడే. రెండును భక్తిరస ప్రధానములే.

హరివంశపర్వమున అధ్యాయములు 55, శ్లోకసంఖ్య 3130. విష్ణుపర్వమున అధ్యాయములు 128, శ్లోకసంఖ్య 7810. భవిష్యపర్వమున అధ్యాయములు 135, శ్లోకసంఖ్య 5120. మొత్తము శ్లోకసంఖ్య 16060. ఈ మూడును క్రమముగా 98,99,100 పర్వసంఖ్యలో నున్నవి? భారతగాథ 97వ సంఖ్యతో సమాప్తి యగుచున్నది.

ఈ మూడు పర్వములును (98-99-100) ఆంధ్రపద్యానువాదము చేసిన వ్యక్తి ఎఱ్ఱాప్రగ్గడ కవీంద్రుడు. కవిత్రయమున ఇతడు తృతీయుడైనను కవిత్వమున అద్వితీయుడు. భారతాంధ్రీకరణము కావించిన ఆదికవి నన్నయభట్టారక, తిక్కనసోమయాజికవుల పిమ్మటివాడు. నన్నయ అసంపూర్తిగా వదిలిన అరణ్యపర్వశేషమును ఆయన రచన వలెనే జాగ్రత్తగా పూరించిన మహోన్నతుడు.

ఎఱ్ఱన పాకనాటి (నెల్లూ మండలము) ప్రాంతము వాడు. క్రీ.శ 14 వశతాబ్ది. గుడ్లూరు గ్రామమున జన్మించినాడు. ఒంగోలుకు దాదాపు 50 కిలోమీటర్లు దూరమందున్నది. నీలకంఠేశ్వర దేవాలయము ఎఱ్ఱనకు కావ్యరచనాకేంద్రము. రామాయణము పూర్తిగా వ్రాసెను. ప్రస్తుతము అది అలభ్యము. నృసింహపురాణము, భారతారణ్యపర్వశేషము, హరివంశములు రచించెను. తాత ఎఱపోతసూరి. తాత పేరే ఎఱ్ఱనకు పెట్టబడెను. రెడ్డి రాజ్యస్థాపకుడైన ప్రోలయవేమారెడ్డి అద్దంకికి, ఎఱ్ఱనకవీంద్రుని, తన తమ్ముడైన చదలువాడ ప్రభువు మల్లారెడ్డి ఆస్థానమందుండగా కోరి రప్పించుకొనెను. ఎఱ్ఱన నృసింహపురాణమును అహోబలనృసింహునకు, హరివంశమును వేమారెడ్డికి, భారతభాగమును రాజరాజనరేంద్రునకు కృతినిచ్చెను. తన గురునామమును శంకర నంయమీశ్వరునిగా పేర్కొనెను. శంభుదాసలక్షణాభిదేయుడనని చాటెను. ప్రబంధ పరమేశ్వర బిరుద మాయనకు, సమకాలిక పాఠకులిచ్చినది. సౌందర్య, కళ్యాణశబ్దము లిష్టములు. ఇట్టి శబ్దములు మక్కువతో వాడును. శ్రీనాథ పోతనాదులకు మార్గదర్శి.

ఎఱ్ఱన వర్ణనా ప్రియుడు. రసోచితసన్నివేశ పారవశ్యముతో, బహువిధవర్ణలతో, భిన్నశైలులతో, అద్భుతాకర్షక శిల్ప బంధురపద్యములల్లుట ఆయనకు సిద్ధించిన విద్య. భారతభాగ రచనా ధురంధరుడు. ఇతని సమకాలిక కవులు సామాన్యులుగారు. విద్యానగర ప్రథమప్రభువు హరిహర రాయల ఆస్థాన కవీంద్రుడు, అష్టభాషాకవీంద్రుడు, నవీనగుణసనాథుడు, సాహిత్య రసపోషణుడు, సంవిధాన చక్రవర్తియైన నాచనసోముడు, సర్వజ్ఞబిరుదాంచితుడు. భాస్కరరామాయణకర్త యగు హుళక్కి భాస్కరుడు, అఖండుడు. నన్నయవలె శైలిలో పద్యము వ్రాయగల ప్రతిభాశాలి. గోనబుద్ధారెడ్డి ద్విపదకావ్యమునకు పరిమితమయ్యెను. శ్రీనాథుని తాత కమలనాభామాత్యుడు పద్మపురాణకర్త. అసామాన్యుడు. కోలాచల మల్లినాథుడు సంస్కృతసాహితీ సామ్రాజ్య పట్టభద్రుడు. మహాకవి. పండితమార్తాండుడు. వ్యాఖ్యాతృష చక్రవర్తి. ఎవ్వరును అరణ్య పర్వశేషమును పూరింపలేకపోయిరి. ఆ ధైర్యసాహసములు ఎఱ్ఱన తపస్వికుండెను.

ప్రకృత మీ ఉపోద్ఘాతమంతయు నవసరమా? ఎట్టిన ప్రసక్తి ఎందులకు? మన ముందున్నది శ్రీహరివంశమను వచన గ్రంథముగదా! ఇది ఎవరికొఱకు? పూర్వమున్న అనువాదముల సంగతి ఏమి? దీని ప్రాశస్త్యమేమి? ఈ గ్రంథ విశేషములు. అనువాదరీతులు. గ్రంథ ప్రచురణావశ్యకత, గ్రంథానువక్తృ ప్రతిభా విశేషములు ముందు తెలియవలెను. ముందుగా అనువక్తృ సమాచారము.

శ్రీసరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి విజయనగరంలో జన్మించినారు. 12 ఏప్రియల్ 1948 తేది శ్రీసర్వధారినామ సంవత్సరము చైత్రశుద్ధ తదియ వీరి జన్మకాలం. కృత్తికానక్షత్ర జాతకులు. వాధూలస గోత్రజులు. వీరి జననిసూర్యాంబ. జనకులు మార్కండేయులు. వీరిది విద్వత్కుటుంబము. సంప్రదాయము వైదికము. వేదవేదాంగస్మార్తమంత్ర పాఠన ప్రవీణులు. శ్రీసోమయాజి గారు మంచి కర్మిష్ఠులు. జగత్ప్రసిద్ధులైన పండితత్రయము - జొన్నలగడ్డ, జటావల్లభుల, విశ్వనాథ (ఆంగ్ల సంస్కృతాంధ్రభాషాధ్యక్షులు) ప్రభృతులతో వీరికి పరిచయము. 1975లో బొబ్బిలి తాలూకా - కలవరాయి అగ్రహారము సంస్కృతాంధ్ర పండితులైన, కౌండిన్యగోత్రజులు శ్రీమహావ్రత యాజులవేంకటశాస్త్రిగారి పుత్రికారత్నము మధురమీనాక్షిగారితో వివాహము జరిగినది. జగత్ప్రసిద్ధులు కావ్యకంఠ గణపతి మహాముని జన్మించిన పవిత్రస్థలము వీరి ధర్మపత్నికి జన్మస్థలము. వీరిది అనుకూలదాంపత్యము. అతిథి, అభ్యాగతులను సత్కరించుట, యజ్ఞయాగాది క్రియలు, దైవపూజా కార్యక్రమములు, ఆధ్యాత్మిక ప్రవచనములు మున్నగు కార్యక్రమములు ఈ దంపతులకు నిత్యానుష్ఠానములు. వీరికి కుమారీపంచకము కలదు. పైతృకధర్మకార్య నిర్వహణలో నిరంతర ప్రవీణులై, ఉన్నత విద్యాభ్యాస మొనరించిన ఉత్తమపుత్రికా రత్నములు. మన రచయితగారికి దివాకర్ల వేంకటావధాని ప్రభృతి కవిపండిత ప్రకాండులతో పరిచయభాగ్యములు కలవు.

నిత్యాగ్నిహోత్రులు, వైశ్వదేవదీక్షాపరులునైన శ్రీయాజిగారు ఆత్మీయదైవము శ్రీరామభద్రుని దయతో, హయగ్రీవోపాసకులై శతాధికవేదాంత సాహిత్య వ్యాసములను రచించి ప్రచురించిరి. శుభం, మోక్షసాధని, భారతీయమార్గం, ఆర్షధర్మం, సౌందర్యభారతి మున్నగు పత్రికలలో వీరి వ్యాసరాజములు ప్రకటితములైనవి. "చిత్సుఖీయము" మూడు భాగములు వ్యాససంకలన గ్రంథములు ప్రచురితములు. ప్రకృతము శ్రీమద్దేవీభాగవతము రచించి ప్రచురించిరి. ఈ "శ్రీహరివంశము" మనకిప్పుడు గ్రంథరూపమున అందించుచున్నారు. ఈ రెండును వచన గ్రంథములే. కేవలానువాదము గావు. వచన కావ్యములు లేక గద్యకావ్యములు అనవచ్చునేమో.

రెండును ఉత్తమోత్తమములైన మూలానుసరణ (గద్య) వచన గ్రంథములు. ఆధ్యాత్మిక నిష్ఠ - వ్యాసంగము - ఆరాధన - వీరి జీవిత ధర్మశీలనమున త్రిపుటిగా ప్రవర్ధమానము లగుచున్నవి. వచన రచనయేగాక, వ్యాసములేగాక, చక్కని పద్యనిర్మాతృ చంద్రములు కూడ వీరిస్వకీయము.

"జన్మించినాడ విజయనగరమునందు, వాధూలగోత్రుండ, బండితుండ
జనయిత్రిసూర్యాంబ, జనకుండు వేదవి, జ్ఞాని మార్కండేయ సద్గుణుండు
శ్రీజగద్గురు నరసింహమహాభార తీస్వామి శిష్యుండ, స్థిరగుణుండ,
బెజవాడ, గుంటూరు వివిధ ప్రదేశముల్, వేదాంత సాహితీవేదికలును

గృహిణి మీనాక్షి ధార్మికసహనశీల,
హైదరాబాదు నగర గణాంకపర్య
వేక్షకుడ, వేదవిద్యావివేకసోమ
యాజిని, సదా నమో పుణ్యభాజనాయ"

శ్రీసోమయాజిగారు రచించిన మహాభారతాంతర్గత సంస్కృతఖిల పర్వములకు "శ్రీహరివంశము" ఆంధ్రానువాదము. ఉత్తమోత్తమ గ్రంథము. స్వేచ్ఛము శ్రేష్ఠమునగు అనువాదము. సరళగ్రాంథికభాషా బంధురము. మొదటి పర్వము 55 అధ్యాయములు. రెండవ పర్వము 128 అధ్యాయములు, మూడవ పర్వము 135 అధ్యాయములు సంస్కృత మూలగ్రంథములందుండగా, శ్రీసోమయాజిగారు తమ మూడు పర్వములందును క్రమముగా 28, 42, 24 శీర్షికలతో సంగ్రహించి రచించిరి. అతిముఖ్యస్తోత్రములు 10 సంఖ్యతో నున్నవి. ఏ అంశమును వీడలేదు.

అనువాదమున రచనా ప్రణాళికను చక్కగా సిద్ధపర్చిరి. అనేక శతాధిక వ్యాసములు, గ్రంథములు రచించి ప్రచురించిన వీరి దక్షిణహస్తమునందలి లేఖిని నుండి జాల్వారిన మధుర సుధాతరంగ మంజుల మహిత నాదాక్షర సంపుటీకరణ శైలి మహాసరస్వతీ కటాక్ష సంపన్నము. వీరి వచనశైలి మధురాతిమధుర సుకుమార బంధురము. మధ్యమధ్య మూలశ్లోకములు, స్తోత్రములు, ఎఱ్ఱన కవీంద్రుని హరివంశపద్యములు, ఘుమఘుమలాడుచు, పఠితృలోకమును ఉఱ్ఱూతలూగించు చున్నవి.

సంస్కృతమూలమందున్న శీర్షికలను కొన్నిటిని మార్చిరి. కొన్నిటిని తీసివేసిరి. కొన్నిటిని యథాతథముగా స్వీకరించిరి. ఆదిసర్గకథనము అని మూలమందుండగా "జగత్సృష్టి" అని అనువదించిరి. శీర్షికలను స్వతంత్రించి వ్రాయుటలో అనువాదకుని

ప్రతిభ, వెల్లడియగుచున్నది. ఒక్కొక్కసారి రెండుమూడు లేక నాలుగైదు మూలశీర్షికలను కలిపి ఒకే తెలుగు శీర్షిక నుంచిరి. కావ్యమున కుండవలసిన సమస్త లక్షణములను వచనగ్రంథమున సురభిళింపజేసిరి.

శ్రీహరివంశము - ఆంధ్రవచన గ్రంథమున గల తళుకులు :

1. భారతాంధ్రీకరణమున తిక్కన సోమయాజి పద్ధతులను శ్రీసరివల్లె సోమయాజిగారును అవలంబించిరి.

(ఎ) యుద్ధపర్వములందు యోధులపేర్లు, యుద్ధసన్నివేశములు వర్ణించుచు తిక్కన వారి వారి ఆయుధముల సంఖ్యలు, వేసినవి, వ్యర్థములైనవి, గ్రుచ్చుకొన్నవి, ఎదుర్కోలుగా వేసినవి వర్ణించుచు మధ్యమధ్య తటాలున చమత్కారములను, సంవాదములను, వినోదములను, ఖేదమోదములను, వర్ణనలను, సన్నివేశములను ఆకర్షణీయముగా చిత్రించెను.

బహుసుందర చమత్కారపదబంధములను, జాతీయములను వాడెను. పాఠకునకు విసుగు జనింపకుండ చేసిన ఈ కృషినే ఆయన శిల్పముగా పేర్కొనెను.

(బి) శాంతి, అనుశాసనిక, ఆశ్రమవాసపర్వములందు సూటిగా సూక్తి పాఠములను చెప్పిచెప్పి శిరోవేదన కలిగింపక, నీతులకు, సూక్తులకు కథాసూత్రములను అనుసంధించెను. చక్కని చిక్కని కథలల్లి పాఠకుని గిలిగింతలు పెట్టెను.

(సి) భీష్మపర్వమున విష్ణుసహస్రనామములను, భగవద్గీతను, ఉద్యోగపర్వమున సనత్సుజాతీయమును, తిక్కన ఆంధ్రీకరింపలేదు. గీతాశ్లోకములు 700కు దాదాపు 50 పద్యములు సారాంశముగా వ్రాసెను.

ఈ విధానములను ఈ "శ్రీహరివంశ" అనువక్తయు రసోచితబంధురముగా ఆచరించెను.

2. రాజాజీరామాయణ, భారతగ్రంథముల ఆంగ్లానువాదములు జగత్ప్రసిద్ధములు. వారు ప్రదర్శించిన శైలి యొక్కటి మాత్రమేగాక మధ్యమధ్య రచయిత ప్రత్యక్షవ్యాఖ్యానమొనర్చుచు, మంచి చెడులను గూర్చి విమర్శించును. శ్రీసోమయాజిగారును ఇంచుమించు ప్రతి శీర్షికలోని కథాప్రవాహమందును, వడపోత పెట్టుట, మంచిచెడులను విమర్శించుట చేయుచు సారమును పిండి పాఠకులకు అందించిరి.

3. ధర్మచింతన అనునది రచయిత చేసిన శీర్షికాంత విషయవిశ్లేషణ బాగున్నది. ఈ పద్ధతికి దగ్గరగా సన్నివేశపరంపరల నేకరువు పెట్టుట నన్నయ, ఎఱ్ఱన

పోతనలు పాటించిరి. అంతేకాదు ప్రతిశీర్షికారంభమున, రచయిత ఒకటి రెండు వాక్యములలో శీర్షికకథాసారంశమును ప్రస్తావనవలె చిత్రించిరి. అనగా ప్రతి శీర్షికను ఆద్యంతములు పాఠకుని మనస్సులో నిలుచు ప్రయత్నము చేసిరి.

4. అనుబంధమునందలి ప్రార్థనాదిక శ్లోకములు యథాతథముగా మూలము నుండి గ్రహించిరి.

5. పాత్రల చిత్తవృత్తులకు తగిన సంవాదములను మూలాతిశయముగా నిర్వహించిరి. ఇతర పురాణాదిక గ్రంథ విషయములను గూడ నటనట ప్రస్తావించిరి. పాఠకునకు కథలో ధర్మసందేహములు కలుగుచోట్ల ఈ నియమమును పాటించిరి.

6. శైలీవిషయమున శిష్టవ్యవహారమును గాదని, బరువైన, రసభరితమైన ఇతిహాసగాథలను, పౌరాణిక గాథలను జోడించి సరళగ్రాంథిక భాషనే రచయిత స్వీకరించిరి. జాతీయములు, లోకోక్తులు, పదబంధములు చక్కగా ఉండి, శైలి ప్రసాదమాధుర్యగుణములతో ఆకర్షణీయమగుచున్నది. అచ్చటచ్చట ఎఱ్ఱన పద్యములు హృద్యములుగా ఉదహరించిరి.

7. రసోవైసః అను ఉపనిషత్సూక్తిని సాహిత్యమున సాధించుటకు ఆధ్యాత్మిక తపస్సు చాలా అవసరము. ఈ గ్రంథమున నాయకుడు శ్రీహరి. నాయిక శ్రీలక్ష్మీదేవి. నవరసములు అనువాదరచనలో పుష్కలముగా పోషింపబడినవి. అంగి(ప్రధాన) రసము భక్తి. అంగరసములు శృంగార , భీభత్స, భయానక, అద్భుత, కరుణ, వీర, శాంత, హాస్యములు అచ్చటచ్చట సందర్భానుసారము పోషించబడినవి. శ్రీహరివంశమున శ్రీహరిచేసిన సాహసకృత్యములు ప్రధానములైనందున, వీరరసమే అంగిరసమని తోచును. మిగిలినవి దీనికి లోబడియున్నవి. రసానుకూలముగా రచనచేయుట అసాధారణ విషయము. కవికి ముందు దైవదత్తమైన ప్రతిభ మిక్కుటముగా నుండవలెను. వ్యుత్పత్తి (పాండిత్యము) అభ్యాసము (అనుభవము)లు కూడ నున్నచో రాణింపు ఉండును. సమాధ్యవస్థలో రచయిత రసపరవశుడై కథా ప్రవాహమున మునుగుచు, తేలుచు, సంవాదములు నడిపించుచు పాత్రలలో పరకాయ ప్రవేశము చేయుచు తాదాత్మ్యమును చెందవలెను. రసవత్కథా సంవిధానము చేసిన రచయితయే మహాగ్రంథ నిర్మాతృ చంద్రముడు అతడే మహాకవి. ఈ లక్షణము శ్రీసోమయాజిగారికి పుష్కలము.

8. వర్ణించువాడే కవి. కవృధాతువునకు వర్ణనమని కదా అర్థము. పాణినిముని ధాతుపాఠమున చెప్పిన అర్థమిది. కవేఃకర్మ కావ్యమ్ – కవి కృత్యమే కావ్యము.

కవయతే వర్ణయతే ఇతి కవిః – వర్ణించువాడే కవి. పద్యము లేక శ్లోకము రచించిన వాడు కవి కాజాలడు. కవితాధర్మముతో నొక్క వాక్యము రసభరితముగా చెప్పినజాలు మహాకవియే. వచన కావ్య రచనాపరమేశ్వరులుగా సంస్కృతభాషావాఙ్మయమున ప్రసిద్ధులు గలరు. దండి, బాణభట్టారకుడు, వాని పుత్రుడు భూషణభట్టారకుడు మొదలగు కవీంద్రుల ధాటికి శ్లోక కవులు తట్టుకొనరైరి. వచనశక్తి లేక గద్యశక్తి అంతగొప్పది. గద వక్తాయాంవాచి అని ధాత్వర్థము. వచన భాషణే అనియూ ధాత్వర్థము. రెండిటికి భేదమంతగా లేదు. ఒక నియమముతో, రసాను కూలశైలి సృష్టించినచో గద్యమందురు. వచనము విస్తార ప్రయోజనము గలది. రసము, ఔచిత్యము, ధ్వని, చమత్కారము, వక్రోక్తి. అలంకారములు గలిగి, కథాసంవిధానము గలది పద్యమైనను, వచనమైనను, కావ్యమే. ఈ వచన రచనలో శ్రీసోమయాజిగారు సిద్ధహస్తులు. మహాకవులు.

శ్రీహరివంశ వచన(గ్రంథము) కావ్యమును సర్వస్వతంత్రముగ అనువాద మనిపించని రీతిలో వీరు రచించిరి. ఇంతవరకు భారతానువాదములు మాత్రమే లభ్యములు. వావిళ్ళ మున్నగు సంస్థలు ప్రచురించినవి కలవు. "శ్రీహరివంశము" (హరివంశపర్వము – విష్ణుపర్వము – భవిష్యపర్వము) ఆధునికాంధ్రసాహితీ చరిత్రలో ధ్రువతార లేక శిఖరమనుటలో సందేహము లేదు.

ఇదిగో గ్రంథము. తొలివాక్యమునందే ప్రతిశీర్షికలోను ఒక చమత్కారధోరణి కన్పించును. పాఠకుడు ఎక్కడ మున్గునో, ఎక్కడ తేలునో తెలియదు. రసాంబుధిలో పాఠకుని మునుకలు వేయించినారు రచయిత. వారి లేఖిని, వారి వాణి, వారి బాణి, వారి ధోరణి సాక్షాత్ భారతీవరివస్యాఫలితము. వారి ఉపాస్యదైవమగు శ్రీహయగ్రీవస్వామి కరుణాకటాక్షవిలసితము.

శ్రీహరివంశము ఆంధ్రపాఠకులకు భక్తులకు ముముక్షువులకు సాహితీవేత్తలకు నిత్యపారాయణ గ్రంథము. ఈ గ్రంథరచయిత శ్రీసోమయాజి ధన్యులు. ఉత్తమ పాఠకులమైనచో మనము కూడ ధన్యులమే.

ఓం తత్సత్

శతావధాని

డా॥ వారణాశి శివరామకృష్ణ

దర్శనాచార్య **డా॥ అకొండి విశ్వనాథం**
అసోసియేట్ ప్రొఫెసర్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్
సి.యస్.ఆర్. కాలేజి, ఒంగోలు. (ఎ.పి.)

విశ్వభారతి
బృందావన్ నగర్ కాలనీ,
ఒంగోలు-523 002.
ఫోన్ : 08592 - 236515

ప్రదీపిక

క : శ్రీరామార్చిత చరణా! నారదమౌనీంద్ర నుత్య! నాకారాధ్యా!
తారాపతిమౌళి! నమ స్కారములర్పింతుఁ గరుణగాంచు మహేశా!!

క : విఘ్నములకెల్ల పతియగు, విఘ్నేశ్వరుతండ్రి వీవు విశ్వేశ్వరుడా
విఘ్నములు కల్గకుండఁగ, విఘ్నేశుని తోడ ఁదెలుపు వినతి మహేశా!!

శ్రీ విద్యోపాసకులు బ్రహ్మశ్రీ వేదమూర్తులైన శ్రీసరిపల్లె వెంకట సుబ్రహ్మణ్య సోమయాజిగారు శ్రీహరివంశమును సుమారు ఏడువందల పుటలలో తెలుగునందు వచన రచన చేసి, తాము ధన్యులగుటయేగాక, విశ్వమందు గల యావదాంధ్ర, ప్రజానీకమును ధన్యులను గావింప దలచుట శ్రీహరిలీలా విశేషమే. పరమధార్మికులు, తపస్వియు, చిత్సుఖానంద దీక్షానాములు, అంబురుహ గర్భకులాభరణులు, వేదవేదాంత విజ్ఞాన ధనాఢ్యులు, అనారతాధ్యాపన తత్పరులు, వివిధాధ్వర ధర్మకర్మ దీక్షాపరతంత్రులు, సనాతన ధర్మాచార పరాయణులునగు శ్రీసోమయాజిగారు ఆర్ష ధర్మోద్ధరణకై చేయు సేవ అనితర సాధ్యము. అనిర్వచనీయము.

వీరు తతవతీ విద్యావరివస్యా రసజ్ఞులగుటచే శ్రీమన్నారాయణాంశ సంభూతుండగు శ్రీ వేదవ్యాస విరచితంబైన శ్రీమహాభారతమునందలి చివరి మూడు పర్వములను పౌనః పున్యముగా పారాయణ గావించి, శ్రీమన్మహాభారత వ్యాఖ్యయౌ నీలకంఠీయమును మథించి "ప్రబంధ పరమేశ్వరుండ' గు ఎఱ్ఱనార్య ప్రణీతంబైన హరివంశమును శోధించి సాధించిన కథాంశములను శ్రీహరివంశమను పేర తెలుగు భాషలో సౌకుమార్య మాధుర్య గుణ భరితంబులైన మాటల మూటలచే మనసులూట లూరించు నటుల చక్కని వచన రచన చేసిన విధాన సంవిధానము కడుంగడు సద్రస భరితంబై బ్రహ్మానంద సముద్రమున మునకలు వేయించుచున్న దన్న సత్యమును రసజ్ఞులగు పఠితలు గ్రహింపగలరు.

శ్రీహరివంశము పఠన శ్రవణ ప్రక్రియలచే పాప హరమై ఐహికాముష్మిక శ్రేయస్సాధనమై భారతీయ భాగధేయమై భాసించుచు, సత్సంతానం బొసగుటయే గాక, మనుమలతోను మునిమనుమలతోను అలరారునట్లు వంశాభివృద్ధి గావించుచు, ఆయురారోగ్య ఐశ్వర్యాదుల నొసంగుచు మంచి మార్గమున నడిపించుచు, మనోవాంఛితముల నీడేర్చునుగాక!

సంస్కృత మహాభారతమునందలి ఆదిపర్వము ద్వితీయాధ్యాయము నందలి 83-84 శ్లోకములను పరిశీలించినచో హరివంశము, భారతమునకు శేషగ్రంథమని తెలియగలదు. అందుకే ఇది 'ఖిల' సంజ్ఞికము. హరివంశము 'ఖిలము' అనగా తర్వాత కలుపబడినదియని కొందరనుచున్నారు. కాని అదిసరికాదు. పరిశిష్టమనియే పండితాభిప్రాయము. "యచ్ఛశాఖాన్తరస్థం శాఖాన్తరే ప్రయోజన వశాత్ పఠ్యతే తత్ ఖిలమితి వైదికీ ప్రసిద్ధిః" అను నీలకంఠీయ నిర్వచనానుసారము విష్ణు పురాణాది గతమై భారతేతి హాసమునందు ఆకాంక్షవశమున పఠింపబడిన హరివంశమునకు "ఖిల"మని పేరు.

నన్నయ్య, హరివంశ భవిష్య పర్వంబులతో గలిపి మహాభారతమున నూరు పర్వములు కలవని లెక్కించెను. ఎఱ్ఱన తదనుగుణముగనే ఆరెండు పర్వములకు బదులుగా హరివంశమును పూర్వ, ఉత్తర భాగములుగ విభజించెను. సంస్కృత హరివంశము నందలి కొన్ని కథలు ఎఱ్ఱన హరివంశమున కనబడుటలేదు. ఎఱ్ఱన, మూలమందున్న హంసడింభకోపాఖ్యానమును-వజ్రనాభకథను స్పృశింపలేదు. పారిజాతాపహరణ కథను మాత్రము కొంత సంగ్రహించిరి. భవిష్యపర్వమును కూడ సంగ్రహముగనే వ్రాసిరి. అందువలననే కాబోలు శ్రీమల్లాది సూర్యనారాయణ శాస్త్రి గారు ఆంధ్ర భవిష్య పర్వము సంపూర్ణముగ లేనిచో మహాభారత మసంపూర్తిగ నుండి పోవునని తలంచి దానిని అత్యంత మనోహరముగ తెలిగించిరి. ఎఱ్ఱన హరివంశములో లేని కథాంశములను తెలిగించినట్లు, నేమాని భైరవ కవి తెల్పెను. ఇతనిది ఉత్తర దేశపు ప్రతి. సుమారు నూట ఏభై ఏండ్ల క్రితము, గూళికల్లు వెంకట రమణ కవి, హరివంశాన్ని పూర్తిగ నాంధ్రీకరించి, యిష్టదైవమగు శ్రీవేంకటేశ్వరునికి యంకిత మొనర్చినట్లు తన కనక రంజిత శిఖామణీ పరిణయమునందు తెలిపెను. హరివంశమును, పద్య గద్యాత్మకంబుగా రచించినది కవి సోమన. ఇతడు, పూర్వోత్తర హరివంశములను రచించినట్లు కొన్ని ఆధారములు కానవచ్చుచున్నవి.

కాని ఎఱ్ఱన సమాకాలీనుడైన సోమన వ్రాసిన నాటి తాళపత్ర గ్రంథములు కొన్నియే లభించుట చేతను, అందును ఉత్తర హరివంశము నందలి కథలు కూడ తారుమారుగ నుండుట చేతను, ఈ మండూక ప్లుతన్యాయమున కచ్చెరువు నొంది, సోమన రచన కొంతవరకు నశింపగా శేషించినది మాత్రమే ఉత్తర హరివంశము పేర పాఠకుల కందజేసితిమను ముక్తాఫల వ్యాఖ్యాకారుల వచనములను స్మరించుచుంటిని. ఉత్తర హరివంశ రచన చేసి, సాహిత్య రస పోషణ సంవిధాన చక్రవర్తియైన సోమనయు, తన గ్రంథమున పారిజాతాపహరణ కథను, వజ్రనాభుని చరిత్రను ఆంధ్రీకరింపలేదు.

నందితిమ్మన హరింవంశమునందలి పారిజాత వృత్తాంతమునే స్వీకరించి "పారిజాతాపహరణము" అనుపేర ఉత్తమ ప్రబంధముగా రచించె. పింగళి సూరన 'ప్రభావతీ ప్రద్యుమ్న' మనుపేర, వజ్రనాభ కథను పేర్కొనుచు ఉత్తమ ప్రబంధముగ విరచించె. ఎఱ్ఱన వీటిని రచింపక, తిమ్మన సూరన కవుల కిరువురుకును చక్కని అవకాశము కల్పించి కవి దిగ్గజములగు నట్లా శీర్వదించెనేమో? ఎఱ్ఱన భవిష్యత్ ద్రష్టకదా! వీటినన్నింటిని పరిశీలించిన వారగుటచే సంస్కృత హరివంశమును, నీలకంఠీయమును, ఎఱ్ఱన హరివంశమును త్రయీమూర్తియై హరివంశ విష్ణు భవిష్యత్పర్వ త్రయంబును త్రివేణీ సంగమ తీర్థంబుగా శ్రీహరివంశామృతంబు నందించి శ్రీసోమయాజిగారు ధన్యులైరి. దీనిని సేవించువారును ధన్యులు కదా!

భారతమున పట్టాభిషేక ఘట్టమువనుసరించి నాయకుడు ధర్మరాజు. భారత పారాయణ హరివంశము లేకుండా పూర్తికాదు. ఏలననగా మహాభారత కథానాయకుడు శ్రీకృష్ణ పరమాత్మయే. ఈతని వంశకథ కలదియే హరివంశము. వచన రచనతో సాగిన యాజిగారి గ్రంథము "శ్రీహరివంశము". మహాభారతమంతయు నడిపించినవాడు శ్రీకృష్ణుడే. ఇట్టి నాయకుని వృత్తాంతమే లేనిచో అది మహాభారతమెట్లగును? కనుకనే హరివంశ రచనతో పూర్వాపర సంగతి కల్పించి ప్రబంధ కర్తయైనాడు ఎఱ్ఱన. శ్రీకృష్ణుడే మహాభారతమున సూత్రధారి యనిన విషయమును, శ్రీహరి నాయకత్వమును పోతన, తన భాగవత ప్రథమ స్కంధమున గల 176 పద్యమును బట్టి సుస్పష్టమగుచున్నది.

పాంచాలీ కబరీ వికర్షణ మహాపాప క్షతా యుష్కులం
జంజద్గర్వుల ధార్తరాష్ట్రుల ననింజంపించి గోవిందుడి
ప్పించెన్ రాజ్యము ధర్మపుత్రునకు గల్పించెన్ మహాఖ్యాతి ఁజే
యించెన్ మూడు తురంగ మేదములు దేవేంద్ర ప్రభావంబునన్

మహాభారతమున కృష్ణుడే నాయకుడు. ప్రతినాయకులెందరున్ననూ చాలమందికి మూలాధారము కంసుడే. వీనితో బాటు జరాసంధాదులున్నారు. మున్ముందు శిశుపాల దంత వక్త్రాదులు ప్రతినాయకులు. వీరు పంపిన రాక్షస మత్తేభాల కుంభస్థలాలను చీల్చే శ్రీకృష్ణ సింహకిశోరుడే మహాభారత కథానాయకుడు. భారత స్త్రీని అవమానించిన దుర్యోధన దుశ్శాసనాది ఆతతాయినులను కురుక్షేత్ర సంగ్రామ రంగంబున మట్టు పెట్టించినవాడు, ధర్మరాజునకు పట్టాభిషేకము చేయించినవాడు, అశ్వమేధ యాగంబులు చేయించినవాడు, ఉగ్రవాదులను మట్టి కరింపించినవాడు, సాధు సత్పురుషులను కాపాడినవాడు, బాల్యమిత్రులకు భోగభాగ్యముల నందించి భూభారము తగ్గించి భక్తులకు ముక్తిని ప్రసాదించిన గోవిందుని వైభవ ప్రాభవం గలదియే హరివంశముతో కూడిన భారతము.

శ్రీ సోమయాజి గారి శ్రీహరివంశము దిఙ్మాత్ర పరిశీలన :

"రసోవై సః – పరమాత్మ రస స్వరూపుడు. అతడే శ్రీహరి. అతడే అనంత కోటి బ్రహ్మాండాన్ని సృజించి, పసి శిశువులా 84 లక్షల రకాల జీవరాశులతో అనుక్షణము ఆడుకుంటూ ఆనందించునని అంటారు. అందుకే భగవంతుడగు శ్రీహరి, ఎన్నో అవతారములను దాల్చినాడు. అన్ని అవతారములలోను శ్రీకృష్ణుని అవతారము పరిపూర్ణావతారము. దైవమే అవతరింపని ఎడల భక్తుడు దర్శించి ముక్తుడగుట ఎట్లు? "యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ" అని కదా శ్రుతి. కనుకనే శ్రీహరివంశము జగత్సృష్టితో ప్రారంభమైనది. ప్రకృతి నుండియే భగవంతుడు విశ్వరచన గావించాడు. శ్రీహరి వీర్యశక్తియే బ్రహ్మాండమైనది. బ్రహ్మ తన శరీరాన్ని స్త్రీ పురుషులుగా విభాగించి ప్రజాసృష్టి చేసె. భూదేవి సర్వాభీష్టములు తీర్చు కామధేనువుగా నవతరింప ఆమెను పాలించు గోపాలుడైనాడు శ్రీహరి. పృథు మహారాజు భూమిని తన కుమార్తెగ వ్యవహరించుటచే, ధరణికి పృథ్వి అనుపేరు వచ్చినది. తర్వాత మన్వంతర వర్ణన, కాలవ్యవస్థ, ఛాయా సూర్యుల సంతతి, త్రిశంకు సగరుల చరిత్ర చెప్పి సత్పురుషుల సేవ సర్వపాప హరమని కథారూపముగ తెల్పిరి. పితృకార్యమహిమ అనంతమని చాటిరి. "న పరదారాన్ గచ్ఛేత్' అను శ్రుతి రహస్యాన్ని పరస్త్రీ కాంక్షచే పుణ్యకర్మ ఫలం నశించి, మానవుడు జీవచ్ఛవమగునని చక్కగ వివరించారు. శుక్రనీతి రచన మనోజ్ఞము. చంద్ర వంశాన్ని వర్ణించిన పద్ధతి, అమావసు, ఆయువు వంశాల వర్ణన, భారతభారతికి సువర్ణాభిషేకము.

నాస్తిక దర్శనానికి జనులు మోహితులు కారాదనే బోధ, మిత్రవాక్యం వంటిది. "అస్తి నాస్తి దిష్టమితి మతిః" శ్రుతి. అస్తికులు నాస్తికులు దైష్టికులు. "నాస్తికోవేద నిందకః" శ్రుతులను నిందించేవారు. వీరలే బ్రహ్మద్వేషులు. "బ్రహ్మ సనాతనమ్" సదాతనం సనాతనం ఎల్లప్పుడు ఉన్నది ఒక్క వేదమే కదా! పరమాత్మను తెలుపునది వేదము కనుక బ్రహ్మయన పరమాత్మ కూడ. వేదములు పరమాత్మయే. శ్రీహరి నిశ్వసితములు. "యస్య నిశ్శ్వసితం వేదాః" "ధాతా యధా పూర్వమకల్పయత్" సృష్టికర్త బ్రహ్మ కూడ ఆ వేదములను గౌరవించియే సృజించును. నాస్తిక ప్రధానములైనవే చార్వాకాది షడ్దర్శనములు, ప్రియముగా పలికే కులుకు పలుకులుండుటచే నిది చార్వాకమైనది. కాశీరాజుల వంశం, యయాతి చరిత్ర, పూరువంశం, యదువంశం, వృష్ణి, అంధకవంశములు, శ్యమంతకమణి వృత్తాంతములతో పాటు ఇందులో జోలపాట కలిపి సర్వము శ్రీహరియే నని తెలిపి విష్ణు అవతార వర్ణనమును ప్రారంభించిరి.

యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
ధర్మసంస్థాపనార్థాయ తథా సంభవతి ప్రభుః - శ్రీహరివంశము 1-41-17

శ్రీహరి యోగశయనము, శ్రీకృష్ణావతార ప్రస్తావన, వాసుదేవునిగా శ్రీహరి దివ్యావతరణతో హరివంశ పర్వము పూర్తిచేసిరి.

శ్రీకృష్ణ జననము ఎఱ్ఱన హరివంశములోని 5ఆ - 95 పద్యాన్ని ఉదహరించి కథాంశము చక్కగ నడిపిరి. ఎఱ్ఱన పద్యరత్నాలు సుమారుగ 161 వివిధ కథలలో నుదహరించిరి. ఈ పర్వంలో శ్రీకృష్ణుని సంపూర్ణ తత్త్వం లోకోత్తరంగా వివరించారు రచయిత. శ్రీకృష్ణుని ఆచరణ శీలత్వము, బోధ యిందు మనోజ్ఞములు. విజ్ఞాన సాంకేతిక పరిజ్ఞానములు ద్వారకానగర నిర్మాణములో తెలియుచున్నవి. 125 సంవత్సరాల 7 నెలల 8 రోజుల పర్యంతము అవతార కాలము దాల్చి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ గావించుటయే గాక, కొందరిని మలచి, మరికొందరిని వలచి, కొందరిని తలచి, మరికొందరిని కొలచిన స్వామి ఏఏ లీలలు చూపిరో కన్నులకు కట్టినట్లు రచయిత వర్ణించిన తీరు రసజ్ఞుల నాకట్టుకొనును. వ్రజవాసము, బృందావన ప్రవేశము, కాళీయ మర్దనము, బలరామలీల, గోవర్ధన ధారణం, గోవింద పదం, రాసక్రీడలు, కంసుని భయభ్రాంతులు, కేశివధ, మధురానగర విజయము, తర్వాత కంస సంహారము, ఇలా కృష్ణ కథామృతాన్ని పంచారు. ఇది సుధీశ్లోక్తము.

కాల ప్రభావముతో ప్రారంభమైన భవిష్యపర్వము పరతత్వాన్ని ప్రబోధించుచు శ్రీహరి ఈశ్వరత్వాన్ని స్థాపన చేసెను. అతి దానంచే బద్ధుడైన బలియంతవాడు భక్తుడై జీవన్ముక్తుడైన విషయము, ఘంటాకర్ణుని యంతవాడు పరాభక్తితో లీనమగు సంవిధానము, అత్యంత మనోజ్ఞములు. ఈ కథాంశమును చదివిన వారందరికిని అంతఃకరణ శుద్ధి కల్గుననుమాట యదార్థము. సంస్కృత హరివంశము నందలి శ్లోకములుదహరించి శివకేశవుల కభేదము చక్కగ ప్రతిపాదించిరి. శివుడు శ్రీకృష్ణుని మహాత్మ్యమును స్తుతించు సందర్భమున...

క॥ నీపేళ్లెన్నియొ యన్నియు నా పేళ్ళును నో ముకుంద నాకున్నీకున్
రూపింప పనిలేదు, భేదంబే పగిదిని నిన్ను గనుట యెఱుగుట నన్నున్

ఎఱ్ఱన హరి -684.

నా నామములన్నియు నీ నామములే. నీకు నాకు ఏ పగిదిని భేదము లేదు. నిన్ను గనుటయే నన్ను నెరుంగుట అన్న సత్యము శ్రుతి సమ్మతము. "ఏకం సత్" ఏకమేవా ఉ ద్వితీయం బ్రహ్మ".

క॥ నిను నొల్లక ననుజేరుట, నను మెచ్చక నిన్ను గొలుచు నరునకు నరకా
యనములుగ దెలుప హరిహర, వినిరూపణ తుల్యమతులు విభులే యెడలన్

(ఎ. హరి 6-85)

కనుక , శివదూషణ చేసిన విష్ణుభక్తుడును, విష్ణు దూషణమును చేసిన శివ భక్తుడును కూడ నరకప్రాప్తి నొందుదురని చెప్పి అభేద బ్రహ్మ బోధకుడై ఆత్మ తత్త్వవిదుడైన ఆర్షక వివతంసుని శైలిని పుణికి పుచ్చుకొన్న వారై రచన సాగించిరి. శివకేశవులు పరస్పరము స్తుతించుకొను సందర్భమున అద్వైతము లెస్సగా నిరూపించబడినది. ఈ ఘట్టము సర్వమత సమానత్వమునకు ప్రతీక. అద్వైత బ్రహ్మానందానుభూతికి పతాకం. తర్వాత హరివంశ మహాత్మ్యమును వినిపించిరి.

త్రయీ రూపంబగు మూడు పర్వములలోను గల కథలయందెన్నియో ధర్మములను రంగరించి, సోమయాజి గారందించిరి. అంతేకాదు, ఈ పర్వముల యందలి విషయమంతయు, తమ తొలిపలుకులో సూచించిరి. అందుకే, చర్విత చర్వణంబగునని వీడు విడచినాడని మనవి చేయుచుంటి. వారి తొలి పలుకులోని పలుకులన్నియు తొలిపలుకులే!

మూడు పర్వములు ముగించిన పిమ్మట, అనుబంధముగా, హరివంశ పురాణాంతర్గత దశస్తోత్రములు ఫలశ్రుతులతో మూలముల నిచ్చిరి. చాల స్తోత్రములకు తాత్పర్యములను

క్షూడ నొసంగిరి. ఈ విధముగా 'శ్రీహరివంశము' 'శ్రీ' తో కూడియుండుటచే సప్తశత్ హృదయమై ఇహపర సాధకంబగునట్లుగా సత్కర్మ భక్తి జ్ఞాన త్రయాన్ని పండిత ప్రకాండులు పరవశించునట్లుగను, సామాన్యులు మాన్యులగునట్లుగను, తేనెలొలుకు నటుల తియ్యతియ్యని మాటల కూర్పులతో నమర్చిన గ్రంథము నందజేసిన శ్రీసరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజిగారు, ధర్మామృతమును పంచి, విశ్వశ్రేయస్సునకు దోహద మొనర్చిరని తలంచుచు, అందులకై శ్రీహరి వారికి వారి కుటుంబమునకు ఆయురారోగ్య ఐశ్వర్యాదుల నొసంగి కాపాడుగాక!

ఒక్కమాట! గ్రంథము మీముందున్నది. అరటిపండొలిచి అరచేతిలో పెట్టినట్లున్నదీ ఆధ్యాత్మిక జ్ఞానామృత ఫలం. ఈ యజవ ప్రసాదము సుధీర్ఘోక్తము. పఠన శ్రవణాదులచే కలుగును భక్తి, ఫలశ్రుతి ముక్తి. హరిః ఓం తత్సత్.

శ్రీమతి & శ్రీ సోమయాజి పుణ్యదంపతులకివే నా శుభాభినందనలు.

శ్లో॥ దంపత్యో రవయో స్సంతు నిత్య సౌభాగ్య సంపదః
ఆరోగ్యంచ శతాయుష్యం పుత్ర పౌత్ర పరంపరా ॥

సకల సుకవి బుధజన విధేయుడు

ఆకొండి విశ్వనాథం

శ్రీహరివంశ పారాయణ విధానము

(పద్మ పురాణోక్తము)

హరివంశపురాణ ప్రాశస్త్యము :

హరివంశపురాణము బ్రహ్మవిష్ణు స్వరూపమని మహర్షులు నుడివిరి. ఇది సనాతన శబ్దబ్రహ్మమయము. ఈ శబ్దబ్రహ్మము నుపాసించువారు పరబ్రహ్మ పరమాత్మ సాక్షాత్కారము పొందెదరు. ఈ పురాణ పారాయణముచే మనోవాక్కాయ కర్మలచే సంచితమైన పాపములన్నియు నశించును. అష్టాదశ పురాణములు అధ్యయనము చేసిన ఫలము లభించును. వైకుంఠధామ ప్రాప్తి గలుగును. పుత్రాభిలాషులు తప్పక యీ పురాణపఠనముగాని శ్రవణముగాని చేయవలెను. హరివంశ పురాణశ్రవణముచే ఇహపరలోక సుఖములు గలుగును. అభీష్టములు సిద్ధించును.

హరివంశ పురాణ పఠన శ్రవణములచే యీ క్రింది దోషములు తొలగును.

దోషము	దోషనిష్కృతి
అపుష్పా (రజోదర్శనముగాని స్త్రీ)	హరివంశపురాణ శ్రవణ/పఠనాదులు పదిసార్లు చేయవలెను.
మృతవత్స (పిల్లలు పుట్టిచనిపోవుట)	ఏడుసార్లు శ్రవణ/పఠనములు చేయవలెను.
స్రావయుక్త(పదేపదే గర్భచ్యుతి)	ఐదుసార్లు పారాయణము చేయవలెను.
కాకవంధ్య (ఒకే ఒక్క సంతాన మున్నవారు)	మూడుసార్లు పారాయణము/శ్రవణము చేయవలెను.
కన్యాప్రజా(కేవల స్త్రీ సంతాన మున్నవారు)	ఒకసారి పారాయణము చేయవలెను.
నపుంసకులు (అల్ప వీర్యముగల పురుషులు)	సువర్ణదాన-ఘృతదానములతో బాటు పదిసార్లు పారాయణ శ్రవణాదులు చేయవలెను.

గోవ్రతమనగా ప్రాతఃకాలము నుండి సూర్యాస్తమయము వరకు ఉపవాస ముండి, సాయంత్రము గోవునకు గడ్డి - తవుడు - కుడితిబెట్టి,

తదనంతరము ఆ దంపతులిరువురు భోజనాదులు చేయవలెను. ఈ గోవ్రతమును ఏ మాసము నందైనను శుక్ల చతుర్దశినాడు ప్రారంభించ వలెను.

పారాయణ విధి :

కలియుగములో నవాహ (తొమ్మిది రోజులు) పారాయణము శ్రేష్ఠము. లేనిచో ఇరువది యొక్క రోజులు కూడ పారాయణము చేయవచ్చును. వంధ్యాదోష నివృత్తికి మాత్రము ముప్పది యొక్క రోజులు పారాయణము / శ్రవణము చేయవలెను.

పారాయణ కాలములో శ్రోతలు - వక్తలు

పాటించవలసిన నియమములు - విధులు :

హరివంశపురాణవక్త సదాచారుడు - శాంతుడు - మాత్సర్యరహితుడు - దయాళువునై యుండవలెను. అతడు పురాణకథ చెప్పు సమయమునందు ఇతరులెవ్వరికీ నమస్కరించరాదు. అట్లుచేసినచో ఎదుటివారికి ఆయుక్షీణ మగును. పురాణముచెప్పు వక్త పరమగురువుతో సమానుడు. అతని ముఖము నుండి వెలువడు పురాణశబ్దములు శ్రోతలపాలిట కామధేనువులు. కనుక పురాణవక్తయందు గౌరవాదరములు గలిగియుండవలెను. పురాణవక్త యువకుడైనను - ముదుసలియైనను - దరిద్రుడైనను - దుర్బలుడైనను అతనియందు గౌరవమర్యాదలకు లోపము జూపరాదు. వక్త విష్ణుభక్తి గలవాడై యుండవలెను. వేదశాస్త్ర పరిచయము గలవాడైన బ్రాహ్మణుడైనచో శ్రేష్ఠుడు. అంతేగాక కథాంశమును చక్కనిదృష్టాంతములతో వివరించువాడై యుండవలెను. మతములను విమర్శించువాడు - స్త్రీలంపటుడు - పాకండ సంభాషణము చేయువాడు పురాణవక్తగా నుండదగడు. శ్రోతలకు విశేషార్థములు వివరించుటకు యింకొక పండితుడు కూడా పురాణవక్తకు తోడుగా నుండవలెను.

హరివంశ పురాణ శ్రవణము (లేక పారాయణము) చేయు శ్రోత బ్రహ్మచర్యము పాటించవలెను. ఆ సమయమున చరువుగాని - పాయసముగాని - హవిష్యాన్నముగాని రోజుకొక్కసారి మాత్రమే భుజించవలెను. శక్తియున్నవారు కేవలము పాలుత్రాగి ఉపవాసముండవలెను. కొంచెము ఫలములు కూడ తినవచ్చును. కటిక ఉపవాసము చేయరాదు. శ్రోత తన భార్యాపుత్రులతో బాటు ప్రాతఃకాలమునందే నిత్యకృత్యములాచరించవలెను. సాయంకాలము కూడ శౌచవిధులు పాటించవలెను. విస్తరాకులో భుజించవలెను. పప్పు -తేనె - నూనె - పాచి అన్నము - వంకాయ - కొడిసెపండు - కాల్చిన పదార్థములు - చిరుసెనగలు - అనుములు - మాంసము మున్నగునవి తినరాదు.

ఉల్లి - వెల్లుల్లి - యింగువ - ముల్లంగి - తామరతూండ్లు - దుంపజాతి కూరలు - గుమ్మడి మున్నగునవి భక్షించరాదు. మనస్సులో కామక్రోధ మదమాత్సర్యములు - దంభము - మానము - లోభమోహములు లేకుండగ నుండవలెను. వేదమును - వైష్ణవులను - బ్రాహ్మణులను - గురువును - గోసేవను - స్త్రీలను - రాజును మహాపురుషులను నిందించరాదు. రజస్వలాస్త్రీ - అపవిత్రులు - పతితులు - గాయత్రీమంత్ర జపరహితులగు బ్రాహ్మణులు - పాషండులు మున్నగువారితో సంభాషించరాదు. శ్రద్ధాభక్తులు గలిగియుండవలెను. శ్రద్ధగల వారికే ఇహపరలోక సిద్ధులు లభించును. అశ్రద్ధతో చేసిన పూజ - దానము - యజ్ఞము - తపస్సు - వ్రతము నిష్ఫలములగును. మంత్రమునందు - ఔషధమునందు గురువునందు ఎవరికెంత విశ్వాసముండునో అంతయే ఫలము సిద్ధించును. హరివంశ పురాణశ్రవణ కార్యక్రమమునకు విఘ్నము రాకుండుటకై బ్రాహ్మణులచే నిత్యము ద్వాదశాక్షర - సంతానగోపాల - మహారుద్ర - గణేశమంత్రములు జపింప జేయవలెను. నిత్యము పార్థివ పూజ చేయించవలెను. లౌకిక వ్యవహారములు - ధనచింతన - గృహసంబంధ విషయములు సాధ్యమైనంత వరకు త్యజించవలెను. హరివంశ కథపై ఏకాగ్రచిత్తమునుంచి శ్రద్ధతో ఆలకించవలెను.

పారాయణ విధి :

హరివంశపురాణమును ఆషాఢ - శ్రావణ - భాద్రపద - ఆశ్వయుజ - కార్తీక - మార్గశిర మాసములందేదైన ఒక రోజు మంచి ముహూర్తమున శ్రోత - వక్తల తారాబల చంద్ర బలముల కనుకూలమగు తిథి, వారములందు ప్రారంభించ వలెను. భక్తులందరికీ ఆహ్వానములు పంపవలెను. కథాస్థలమును పుణ్యతీర్థములోగాని - చక్కని వనములోగాని - స్వగృహములోగాని ఏర్పాటు చేయవలెను. ఆ ప్రదేశమును ఆవుపేడతో శుద్ధిచేసి అలికి ముగ్గులుపెట్టి మంటపమునకు నాలుగు ప్రక్కల అరటిస్తంభములు కట్టవలెను. నలుదిశల ధ్వజారోహణముచేయవలెను. మంటప ప్రదేశమునందు చక్కని తివాచీలు పరచవలెను. ఒక ప్రక్కన ఎత్తుగ ఏడులోకములు, క్రిందుగ ఏడులోకములు ఉండునట్లు ఏర్పాటుచేసి, శ్రోతలు కూర్చొనుటకు తగు వసతి నేర్పరచవలెను. బ్రాహ్మణులకు ఎత్తైన స్థానములందును, ఇతరులను మిగిలిన స్థానములందు కూర్చొండబెట్టవలెను. పురాణము చెప్పు వక్తకు దివ్యాసనము నేర్పాటు చేయవలెను. వక్త-శ్రోతలు తూర్పు ఉత్తర ముఖములుగా కూర్చుండవలెను.

హరివంశపురాణము వినదలచిన శ్రోత ముందుగా తన పితరులకు తర్పణల

v)

నీయవలెను. అటుపిమ్మట సర్వతోభద్రమండల పూజ చేయవలెను. గణపతి పూజ చేసి లక్ష్మీనారాయణులను ప్రతిష్ఠించవలెను. ఇతర పరివారదేవతల నాహ్వానించి పూజించవలెను. లక్ష్మీనారాయణులను - రుక్మిణీ శ్రీకృష్ణులను షోడశోపచారములతో పూజించవలెను. హరివంశ పురాణ గ్రంథము నొక చక్కని ఆసనముపై నుంచి వక్తశ్రోతలిరువురు దానిని పూజించవలెను. శ్రేష్ఠబ్రాహ్మణులను కూడ పూజించవలెను. తదనంతరము దేవతావిగ్రహములకు - పురాణ గ్రంథమునకు ప్రదక్షిణ నమస్కారములు చేసి యివ్విధముగా స్తుతించవలెను.

సంసారసాగరే మగ్నం దీనం మాం కరుణానిధే
కర్మగ్రాహే గృహీతోఽహం మాముద్ధర భవార్ణవాత్
తతః శ్రీహరివంశస్య పూజాకార్యం ప్రయత్నతః
విధినా షోడశేనైవ ధూపదీప సమన్వితా

ఇవ్విధముగా స్తుతించి నారికేళ ఫలమును పుస్తకమువద్ద కొట్టి నైవేద్యము పెట్టవలెను. పిమ్మట భగవంతునిట్లు అర్థించవలెను.

స్వీకృతోఽసి మయానాథ పుత్రార్థం భవసాగరే
మనోరథో మదీయోఽయం సఫలః సర్వధాత్వయా
నిర్విఘ్నేనైవ కర్తవ్యో దాసోఽహం తవ కేశవ

అటు పిమ్మట శ్రోత తూర్పుముఖముగా కూర్చుని "దేశకాల సంకీర్తనము చేసి..... గోత్రస్య .... ప్రవరస్య .... శర్మ సపత్నీకస్య మమ జన్మ జన్మని సంచిత మహాపాతక పటల నాశ పూర్వకం తేన పాపసంచయేన కృతసంతాన బాధకతా వినాశపూర్వకమహజన్మని సంతానోత్పత్తి హేతవే తస్య సంతానస్య శరదాం శతమాయుషో వృద్ధ్యర్థ మాత్మనశ్చ సకల సుఖాప్తి హేతవే ఇహ శరీర శుద్ధ్యర్థం పరత్రచేంద్రాది లోకాతిక్రమణ పూర్వక శ్రీమద్విష్ణుభక్త్యుద్రేక జనిత కల్పావధి తల్లోకగమన తత్ర వాసపూర్వక తత్స్వరూపావాప్తి హేతవే ఆవాం దంపతీ శ్రీమద్ధరివంశ పురాణశ్రవణం కర్తృకతయా కరిష్యావహే! అన్యతర కర్తృత్వే కరిష్యే" అని సంకల్పించవలెను.

తదనంతరము పురాణవక్తను విధిపూర్వకముగ పూజించి అతనికి ఒక బంగారు ఉంగరము - రెండు సువర్ణకుండలములు - ధోవతుల జత - శాలువ - పగిడీ - పూవులు - పండ్లు - తాంబూలము - వక్కలు - అక్షతలు సమర్పించవలెను. అటుపిమ్మట యీ శ్లోకము చెప్పి వక్తకు నమస్కరించవలెను.

"వ్యాసరూప ప్రబోధజ్ఞ సర్వశాస్త్ర విశారద
ఏ తత్కథా ప్రకాశేన మదజ్ఞానం వినాశయ"

అటు పిమ్మట శ్రోత యివ్విధముగా సంకల్పించవలెను.

అద్య బ్రహ్మణ ద్వితీయ పరార్థే........ గోత్రః ...... శర్మాణమేభి శ్చందన తాంబూల సువర్ణ వస్త్రాభిర్హరివంశ శ్రవణే వాచకత్వేనావాం దమ్పతీ త్వాం వృణీవహే

వక్త - **వృతోఽస్మీతి తేనోక్తే**

శ్రోత - **వ్రతేన దీక్షామాప్నోతి దీక్షాయప్తోతి దక్షిణామ్**

దక్షిణా శ్రద్ధామాప్నోతి శ్రద్ధయా సత్యమాప్యతే

(శ్రోత యీ మంత్రము చెప్పుచు వక్త యొక్క కుడిచేతికి రక్షాబంధనము చేయును. అటుపిమ్మట పురాణవక్త కూడ శ్రోత దంపతుల హస్తములకు రక్షాబంధనము చేయవలెను.)

వక్త - శ్రోత తదితరులు లేచి నిలబడి భక్తితో పురాణ శ్రవణమునకు ముందు ప్రతి రోజూ వ్యాసమహర్షిని స్తుతించి ధ్యానశ్లోకములను పఠించవలెను.

నమస్తే భగవాన్ వ్యాస సర్వశాస్త్రార్థ కోవిద
బ్రహ్మవిష్ణు మహేశానమూర్తే సత్యవతీ సుత॥

నారాయణం నమస్కృత్య నరంచైవ నరత్తోమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్ ॥

జయతు పరాశర సూనుః సత్యవతీ హృదయనందనోవ్యాసః
యస్యాస్య కమల గలితం వాఙ్మయమమృతం జగత్పిబతి ॥
అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా
చక్షురున్మీలితం యేన తస్మైశ్రీగురవే నమః ॥

అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరమ్
తత్పదం దర్శితం యేన తస్మై శ్రీగురవే నమః ॥

పురాణవక్త సూర్యోదయము నుండి మధ్యాహ్నము వరకు పురాణము చెప్పవలెను. మధ్యాహ్నము రెండు ఘడియలు విరామకాలము పాటించవలెను. ఆ సమయమున భక్తులు హరినామ సంకీర్తనము చేయవలెను.

శ్రోతలు ఉన్నతాసనముపై కూర్చుని కథాశ్రవణము చేయరాదు. కథ మధ్యలో

వెళ్ళిపోరాదు. పగిడీ ధరించి వినరాదు. కూర్చుని రెండు చేతులు జోడించి కథాశ్రవణము చేయవలెను. కథాసమయమునందు ఇతరులతో మాట్లాడుట పిల్లలను ముద్దాడుట - పరిహాసములాడుట చేయరాదు. ఈ పురాణమును ధూర్తులకు - దురాచారులకు - తర్కవాదము చేయువారలకు వినిపించరాదు. ఈ పుణ్యకథను సజ్జనులున్న గ్రామములోను - ఉత్తమక్షేత్రములందు - దేవతా మందిరములందు - నదీనదముల పవిత్రతీరములందును చెప్పవలెను.

హరివంశ నవాహయజ్ఞము పూర్తయినంతనే పురాణవక్తను - పురాణ గ్రంథమును భక్తితో పూజించవలెను. శంఖధ్వనులతో, మృదంగ వాద్యములతో, చప్పట్లతో, హరిభజన చేయవలెను. పురాణవక్త శ్రోతలకు తులసిమాలను, ప్రసాదమును యీయవలెను. పురాణవక్తకు లక్ష్మీనారాయణుల బంగారు పతకమును వస్త్రములను సమర్పించవలెను. గోదానము చేయవలెను. అన్నసంతర్పణ చేయవలెను. పురాణవక్తకు పదునెనిమిది వందల రూపాయలకు తగ్గకుండా దక్షిణనీయవలెను. హరివంశపురాణ శ్రవణమాత్రముతో మహాపాతక - ఉపపాతకములు నశించును. పరమపదము లభించును. హరివంశము వ్రాసి దానము చేయువానికి భూదాన ఫలము కలుగును. హరివంశ పురాణ శ్రవణము చేసిన వానికి రాజసూయ - అశ్వమేధ యాగములొనర్చిన ఫలము సిద్ధించును.

- ఓం తత్సత్ -

శ్రీహరివంశము - విషయసూచిక

విష్ణుపర్వము

భవిష్యపర్వము



శ్రీ సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజిగారు వాధూలస గోత్రోద్భవులు. శ్రీసరిపల్లె మార్కండేయులు సూర్యాంబ దంపతుల ఏకైకపుత్రుడు. సర్వధారి నామసంవత్సర చైత్ర శుద్ధ తదియ సోమవారము 12-4-1948 విజయనగరమునందు జన్మించిరి. రాజాం, విజయవాడ, హైదరాబాద్‌లలో విద్యాభ్యాసము చేసి ఛార్టర్డ్ అకౌంటెంట్‌గా వ్యాపార సంస్థలలోను, బ్యాంకులలోను ఉన్నత పదవుల నలరించిరి. ప్రస్తుతము ఆర్థిక సలహాదారుగా అనేక సంస్థలకు సేవలందించుచుండిరి. గత ముప్పది ఏండ్లుగా వేదపాఠశాలలకు, గుంటూరు హిందూకాలేజి మరియు దాని అనుబంధ సంస్థలకు అధ్యక్షులుగా సభ్యులుగా విద్యారంగ సేవలు చేయుచుండిరి.

శ్రీశృంగేరీ శ్రీవిరూపాక్ష శ్రీపీఠశిష్యులుగా అనేక అధ్యాత్మిక కార్యక్రమములలో పాల్గొనిరి. జగద్గురు శ్రీశ్రీశ్రీ నృసింహానంద భారతీమహాస్వామివారి అనుగ్రహముతో మహాపాదుకాంత శ్రీవిద్యాదీక్ష గ్రహించి వేదాధ్యయనము, శ్రీచక్రార్చనలు, ఉపనిషత్ శ్రవణము, పురాణేతిహాస పఠనము, స్మృతిశాస్త్ర దర్శన పరిశీలనము, అనేక అధ్యాత్మిక వ్యాసంగములు నెరపిరి. కావ్యప్రబంధములు చదివిరి. మంత్రశాస్త్రమును తరచి విశేషముగ అనుష్ఠించిరి. సనాతన ధర్మానుశీలురై నిత్యాగ్ని హోత్ర వైశ్వదేవములు చేసిరి. తమ ఇష్టదైవములగు శ్రీరామ, హయగ్రీవ దేవతా ప్రతిష్ఠలు గావించిరి. శివకేశవులందు అభేద దృష్టితో శివ విష్ణువ్రతములు ఆచరించిరి. ఆసేతు హిమాచలమునందున్న పుణ్యతీర్థములు దర్శించిరి. నిరంతర స్వాధ్యాయ శీలురై శ్రీమద్దేవీ భాగవతము, హరివంశము, శ్రీమద్రామాయణము, మహాభారత ఉపాఖ్యానములు, ఆధ్యాత్మ గీతాలహరి, శ్రీమద్భాగవతము, చిత్సుఖీయము మున్నగు బృహత్ గ్రంథములు రచించిరి. భారతీయ మార్గము, శుభమ్, ఆర్షధర్మము, ఆత్మజ్యోతి, మోక్షసాధని, బ్రహ్మతేజము, ధర్మజ్యోతి మున్నగు ఆధ్యాత్మిక పత్రికలలో నేటి వరకు సుమారు మూడు వందల వ్యాసములు వ్రాసిరి. ఇపుడు "సూత సంహిత" యను వేదాంత గ్రంథమును రచించుచుండిరి.